
సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా ఎదుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా, దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 21.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 210 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



మైనింగ్‌కు మహర్దశ

ఖనిజ సంపద వినియోగంపై సీఎం దిశానిర్దేశం



ఏపీఎండీసీ ఐపీవోకు గ్రీన్‌సిగ్నల్ | **రేర్ ఎర్త్ అన్వేషణకు ప్రత్యేక సంస్థ**

అమరావతి, నవంబర్ 20 (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సాయం కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో ఖనిజ వనరుల విలువ పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, మన వనరులు...మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెచ్చేలా ప్రయత్నించాలని సీఎం అన్నారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనగా చూడకుండా...భవిష్యత్ ఆస్తిగా మార్చడమే లక్ష్యం కావాలన్నారు.

రాష్ట్రంలో 209 క్లస్టర్లుగా ఖనిజ నిక్షేపాలు : రాష్ట్రంలో 74,860 చ.కి.మీ. పరిధిలో మొత్తం 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలు గుర్తించి, 209 క్లస్టర్లుగా విభజించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది డిసెంబర్ లక్ష్యంగా ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేలా ఐపీఓ కార్యాచరణ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లేలా సీఎం నిర్దేశించారు. ఖనిజ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. 2 లో..



ఉద్యాన పంటలకు తీరని నష్టం

అర్నబ్, మురసు తుఫాన్లతో రూ.1,092 కోట్ల నష్టం

18 జిల్లాల్లో 29,960 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

71,576 మంది రైతులకు తీవ్ర నష్టం

2 లో

అదనంగా రూ.96.33 కోట్ల సాయం అందించాలని కేంద్రానికి లేఖ

ధరల కట్టడికి ఏడాది ప్రణాళిక

ప్రతి వారం మార్కెట్ ధరలపై సమీక్ష

రైతులకు గిట్టుబాటు.. వినియోగదారులకు ఊరట

రేషన్ దుకాణాల్లో కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్

అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

2 లో



క్యాన్సర్‌పై సాంకేతిక అస్త్రం

రొమ్ము పరీక్షల్లో సరికొత్త విప్లవం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు రాష్ట్రంలో సెన్సార్ల ఆధారంగా పనిచేసే ఆధునిక పరీక్షా విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలో non-communicable diseas (ఎన్‌సీడీ) కార్యక్రమం కింద కొత్తగా జరిగే సర్వేలో భాగంగా ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాలతో మహిళలకు రొమ్ము పరీక్షలు నిర్వహించనున్నారు. ఇటీవల NCD–4.0 సర్వే ముగిసిశీది. .దీనికి కొన సాగింపుగా కొత్తగా మళ్ళీ బీపీ, మధుమేహశీ, ఓరల్, గర్భాశయ, బ్రెస్ట్ స్క్రీనింగ్ జరగబోతుశీది . ఈ క్రమంలో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో లక్షలాది మంది మహిళలకు ఈ ibreast సాంకేతికతతో బ్రెస్ట్ పరీక్షలు నిర్వహించేందుకు వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. గ్రామాల్లోనే మహిళల ఇళ్ల వద్ద లేదా విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఈ పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాల వినియోగంపై శిక్షణ పొందిన మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, అధికారులతో మంత్రి చర్చించారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతిక పరిజ్ఞాన వినియోగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ క్రమంలోనే వైద్యారోగ్య శాఖ ఇప్పటికే మెడ్‌టెక్ ఛాలెంజ్ ద్వారా కృత్రిమ మేధ ఆధారిత వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.

కణుతుల గుర్తింపు మరింత సులభతరం : ప్రస్తుతం వైద్య సిబ్బంది చేతులతో రొమ్మును పరిశీలించి, తాకి కణుతులు ఉన్నాయా లేదా అని గుర్తిస్తున్నారు.

సెన్సార్లతో కణుతుల గుర్తింపు

రూ.56 కోట్లతో రాష్ట్రానికి 750 పరికరాలు

10 లక్షల మంది మహిళలకు పరీక్షలు

ఎన్‌సీడీ సర్వేలో వినియోగం | రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- స్థానిక ఎన్నికల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు
- ఆక్వా తుపాను ప్రభావంపై ముందస్తు జాగ్రత్తలు
- వేంపల్లి పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లికార్జున, శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్ రెడ్డి, ఐజీ బి. రాజకుమారి లతోపాటు వైఎస్సార్ కడప, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రధాన ఆదేశాలు : ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి. మిగతా 2లో...

జడ్పీలకు కొత్త సారథులు!



- చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక పూర్తి
- 15 కొత్త జిల్లాల ఏర్పాటుతో తొలిసారి ఎన్నికలు
- పలు జిల్లాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులు

3 లో

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : : రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్‌లకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. గతంలో 13 జిల్లా పరిషత్‌లు ఉండగా.. కొత్తగా 15 జిల్లాల ఏర్పాటు తర్వాత వాటి సంఖ్య 28కి చేరింది.

తాడిపత్రిలో రణరంగం

- టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య భీకర ఘర్షణ
- పరస్పరం రాళ్లదాడులు.. ఏడుగురికి తీవ్ర గాయాలు

2 లో

- ధ్వంసమైన వాహనాలు.. కార్లకు నిప్పు
- 20 బైకులు దగ్ధమైనట్లు ఆరోపణలు
- పట్టణంలో భారీగా పోలీసు బలగాల మోహరింపు

ఏపీ మెప్మాకు జాతీయ నీరాజనం

- ఏడు ప్రతిష్ఠాత్మక అవార్డులు కైవసం
- రాష్ట్రస్థాయిలో మూడు.. పట్టణ స్థానిక సంస్థలకు నాలుగు
- ప్రచార కార్యక్రమాల నిర్వహణలో దేశంలోనే ప్రథమ స్థానం
- రుణాల పంపిణీలో రెండో ర్యాంకు.. సమగ్ర పనితీరులో మూడో స్థానం
- రూ.1,016.88 కోట్ల రుణాలతో 4.94 లక్షల మంది వీధి వ్యాపారులకు లబ్ధి

2 లో

కావేరీ జలాలపై తమిళనాడుకు షాక్

అదనపు 11 టీఎంసీల నీటి విడుదలకు సుప్రీం నిరాకరణ

పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

పంటలు దెబ్బతింటున్నాయన్న తమిళనాడు వాదన

కరవు పరిస్థితులున్నాయని కర్ణాటక అభ్యంతరం

3 లో



యుద్ధాల వేళ.. భారత్ శాంతి సందేశం

- సాంస్కృతిక బంధాలే విశ్వశాంతికి వారధులు
- ఎస్‌సీఓ వేదికగా ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఉద్రిక్తతలు, అశాంతిపై చర్చలు సాగుతున్న వేళ.. భారత్ మాత్రం శాంతి, సాంస్కృతిక అనుబంధాల బలోపేతానికి వేదికగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశాల మధ్య నాగరికతా సంబంధాలు, సాంస్కృతిక బంధాలే ప్రపంచ శాంతికి బలమైన పునాదులని ఉద్ఘాటించారు. దిల్లీలోని చారిత్రక పురానా ఖిలా వేదికగా శుక్రవారం తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నాగరికతల సంభాషణ వేదిక (సివిలైజేషన్ డైలాగ్ ఫోరం)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరస్పర సంభాషణలు, సాంస్కృతిక మార్పిడితో దేశాల మధ్య విశ్వాసం, ఐక్యత మరింత బలపడతాయని చెప్పారు.

మహాభారత కాలం నాటి చరిత్రతో ముడిపడిన పురానా ఖిలా ఈ అంతర్జాతీయ సదస్సుకు తగిన వేదికగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో వేద మంత్రోచ్ఛారణలు, బౌద్ధ సంప్రదాయాలు, హనుమంతుడి ప్రయాణ ఘట్టాలను ప్రతిబింబించే ప్రదర్శనలు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పాయని వివరించారు. ఇవి యావత్ మానవాళికి ప్రేమ, ఐక్యత సందేశాన్ని అందిస్తున్నాయని అన్నారు. 25 ఏళ్ల పూర్తి చేసుకున్న ఎస్‌సీఓ కూటమి ఇప్పటివరకు భద్రత, ఆర్థిక, అనుసంధాన రంగాల్లో సహకారాన్ని పెంపొందించిందని.. ఇప్పుడు సాంస్కృతిక సహకారం సభ్య దేశాల మధ్య బంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సభ్య దేశాల మధ్య సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు మోదీ పలు ప్రతిపాదనలు చేశారు. వేల ఏళ్ల చరిత్ర కలిగిన తాళపత్ర గ్రంథాలు, అరుదైన చారిత్రక పత్రాలు, ప్రాచీన సాహిత్యాన్ని డిజిటలీకరించాలని సూచించారు. మిగతా 2లో...

మైనింగ్‌కు మహర్దశ



(మొదటి పేజీ తరువాయి)

రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, వాటికి విలువ పెంచడమే లక్ష్యం కావాలన్నారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియ వేగవంతం చేసేలా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పరిష్కారానికి గడువు పొడిగింపు ప్రతిపాదనలపై సమీక్షలో చర్చించారు. పెండింగ్ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంతో ప్రభుత్వానికి సుమారు రూ. 400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాగే, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా కోసం ఒడిశా, జార్ఖండ్‌లో మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. మూడు బొగ్గు బ్లాక్‌ల్లో మొత్తం 1,774.6 మిలియన్ టన్నుల మేర బొగ్గు నిల్వలు ఉన్నాయి. సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు తీరని నష్టం



అమరావతి, నవంబరు 20(జర్నలిస్ట్ ఫైల్) : రెండు వరుస తుఫాన్ల కారణంగా దెబ్బ తిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనపు సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుపానుల కారణంగా రాష్ట్రంలో ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందని లేఖలో ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2, తేదీలలో వరుసగా ఏపీని తాకిన ఈ రెండు తుపానుల ధాటికి 18 జిల్లాల్లోని 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. అర్నబ్ తుఫాను కారణంగా 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు వివరించారు. ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిందని వివరించారు. మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న తోటల పునరుద్ధరణ, రైతులను ఆదుకునేందుకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ. 96.33 కోట్ల సాయం అందించాలని సీఎం కోరారు. అత్యధికంగా అరటి పంట తీవ్రస్థాయిలో దెబ్బతిందని దానిని పునరుద్ధరించేందుకు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్మెంట్ స్కీమ్ కింద హెక్టారుకు రూ. 44 వేల చొప్పున నిధులు అందించాలని కోరారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఎండుమిర్చి, కూరగాయల పంటలను ఆదుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అలాగే కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణ, బాపట్ల, తదితర జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. తోటల పునరుద్ధరణ, దీర్ఘకాలిక ఆర్థిక నష్టాలను తగ్గించేందుకు త్వరితగతిన సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

తాడిపత్రిలో రణరంగం



తాడిపత్రి (అనంతపురం): అనంతపురం జిల్లా తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరువర్గాల వారు పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో ఏడుగురు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. మరోవైపు వైసీపీ నేతలకు చెందిన రెండు కార్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సుమారు 20 ద్విచక్ర వాహనాలు దగ్ధమైనట్లు ఆరోపణలు రావడంతో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసం వద్ద మొదట ఘర్షణ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అనంతరం టీడీపీ వర్గీయులు జూనియర్ కళాశాల వద్దకు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్తా రాళ్లదాడికి దారితీసింది. ఈ ఘటనలో పలువాహనాలు ధ్వంసమయ్యాయి. పెద్దారెడ్డి నివాసంపై నుంచి రాళ్లు రువ్వడంతో టీడీపీకి చెందిన ఏడుగురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మరోవైపు వైసీపీ నేతలు రంగారెడ్డి, బోయ రాజుకు చెందిన రెండు కార్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సజ్జలదిన్నె పంచాయతీ సర్పంచిగా నామినేషన్ వేయవద్దంటూ తనను బెదిరించారని బోయ రాజు ఆరోపించారు. తన కారుకు జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులే నిప్పు పెట్టారని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన కార్లను పరిశీలించారు. అనంతరం తాడిపత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. వైసీపీ నేతలపై దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సజ్జలదిన్నె, ఇగుడూరు గ్రామాల్లో వైసీపీ నేతల వాహనాలను ధ్వంసం చేసిన జేసీ వర్గీయులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ నారాయణరెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాడిపత్రిలో నిన్నటి నుంచి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి చెందిన పది వాహనాలను ధ్వంసం చేసినట్లు సమాచారం. సుమారు 20 ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరుస ఘటనల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు.

క్యాన్సర్‌పై సాంకేతిక అస్త్రం



(మొదటి పేజీ తరువాయి)

ఐబ్రెస్ట్ ఎగ్జామ్ (ఐబీఈ) పరికరాన్ని యూఈ లైఫ్‌సైన్సెస్ సంస్థ అభివృద్ధి చేసింది. ఇది చేతితో పట్టుకునే చిన్న పరికరం. ఇందులో డైనమిక్ కో-ప్లానర్ కెపాసిటివ్ సెన్సార్ సాంకేతికతను ఉపయోగిస్తారు. బ్యాటరీతో పనిచేసే ఈ పరికరాన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు. వైర్‌లెస్ సౌకర్యం కూడా ఉంది. ఈ పరికరాన్ని రొమ్ము పైభాగంలో ఉంచి, అందులోని ప్రత్యేక ఎలక్ట్రానిక్ సెన్సార్ల ద్వారా కణజాలంలో మార్పులను అంచనా వేస్తారు. పరీక్ష పూర్తయిన వెంటనే ప్రత్యేక మొబైల్‌లో రంగుల రూపంలో డిజిటల్ ఫలితాలు కనిపిస్తాయి. అసాధారణ మార్పులు ఉన్నట్లు గుర్తించిన మహిళలను తదుపరి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రులకు పంపిస్తారు. ఈ విధానం వల్ల మహిళలు ఎలాంటి సంకోచం లేకుండా పరీక్షలు చేయించుకునేందుకు ముందుకొస్తారని, తద్వారా క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించే అవకాశాలు మెరుగుపడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ పరికరంతో ఒక పరీక్ష నిర్వహించడానికి సగటున 20 నిమిషాల సమయం పడుతుంది. రొమ్మును నొక్కాల్సిన అవసరం ఉండదు. రేడియేషన్ ఉండదు. శరీరానికి ఎలాంటి గాయం చేయకుండా పరీక్ష నిర్వహించవచ్చు. అయితే ఇది సాధారణ వైద్య పరీక్షకు తోడ్పడే సాంకేతికత మాత్రమే. క్యాన్సర్‌ను నిర్ధారించే వైద్య పరీక్షలకు ప్రత్యామ్నాయం కాదు.

ఐబ్రెస్ట్ ఎగ్జామ్‌లో అసాధారణ మార్పులు కనిపించిన మహిళలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాలలకు పంపిస్తారు. అవసరాన్ని బట్టి అల్ట్రాసౌండ్, మామోగ్రఫీ, బయాప్సీ పరీక్షలు నిర్వహిస్తారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి ప్రత్యేక క్యాన్సర్ చికిత్స కేంద్రాల్లో వైద్యం అందిస్తారు.

యూఎస్ఎఫ్‌డీఏ, సీడీఎస్‌సీఓ ఆమోదం : ఈ పరికరం వినియోగానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది. భారతదేశంలో కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) కూడా అనుమతి ఇచ్చింది. దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ పరికరం పనితీరుపై పరిశోధనలు నిర్వహించారు. ఆయా అధ్యయనాల్లో మహిళల రొమ్ము పరీక్షల ఫలితాల్లో సుమారు 86 శాతం వరకు కచ్చితత్వం నమోదైనట్లు వెల్లడైంది. రిషికేశ్ ఎయిమ్స్‌లో కూడా మహిళలపై అధ్యయనం నిర్వహించారు. ఈ విధానం అమలుకు ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు నేతృత్వంలోని కమిటీ కూడా ఆమోదం తెలిపింది.

రూ.56 కోట్లతో 750 పరికరాలు : భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సంస్థ సామాజిక బాధ్యత నిధుల కింద 750 ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాలను వైద్యారోగ్య శాఖకు అందించేందుకు అంగీకరించింది. ఒక్కో పరికరం విలువ సుమారు రూ. 7.5 లక్షలు. మొత్తం 750 పరికరాల వ్యయం సుమారు రూ. 56 కోట్లు. ఈ మేరకు బీపీసీఎల్‌తో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఒప్పందం చేసుకున్నారు. బీపీసీఎల్ నిధులతో హెచ్ఎల్ఎల్ ఇన్‌ఫ్రా టెక్ లిమిటెడ్ (హైట్స్) పరికరాలను కొనుగోలు చేసి వైద్యారోగ్య శాఖకు అందిస్తోంది.

ఇప్పటికే తొలి విడతగా 375 పరికరాలను అందించగా, వాటిని 13 జిల్లాలకు పంపిణీ చేశారు. ఆయా జిల్లాల్లో మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్రంలో ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాల పంపిణీని రెండు విడతల్లో చేపడుతున్నారు. తొలి విడతలో 375 పరికరాలను పంపిణీ చేయగా, రెండో విడతలో మిగిలిన 375 పరికరాలను ఇతర జిల్లాలకు పంపిస్తారు. ఆయా జిల్లాల్లోని గ్రామాల జనాభా ఆధారంగా మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు పరికరాలను కేటాయిస్తామని అధికారులు మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు. ఈ పరికరాల ద్వారా ఎనిమిది లక్షల నుంచి పది లక్షల మంది మహిళలకు వయసు ప్రామాణికంగా చేసుకొని పరీక్షలు చేసే అవకాశం ఉంది.

ధరల కట్టడికి ఏడాది ప్రణాళిక

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ఏడాది కాలానికి పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లో ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని స్పష్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు వినియోగదారులకు తక్కువ ధరలకు సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిత్యావసరాల ధరల నియంత్రణ, మార్కెట్ జోక్యంపై ఆయన సమీక్ష నిర్వహించారు.

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ విక్రయించనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యమంత్రికి వివరించారు. కిలో కందిపప్పు రూ. 100, గోధుమ పిండి రూ. 25, లీటరు పామాయిల్ రూ. 125 చొప్పున అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. ద్రవ్యోల్బణం పెరగకుండా వ్యవసాయం, మార్కెటింగ్, పౌరసరఫరాలు, రైతుబజార్ల శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ధరలు పెరిగిన తర్వాత స్పందించడం కాకుండా.. ముందుగానే మార్కెట్



పరిస్థితులను అంచనా వేస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం కందిపప్పు ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో కంది సాగును ప్రోత్సహించాలని చంద్రబాబు సూచించారు. నాసిక్ రకం ఉల్లిపాయల సాగుకు రాష్ట్రంలో ఎక్కడ అనుకూల పరిస్థితులు ఉన్నాయో అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల రైతులకు ఈ పంట సాగుపై అవగాహన కల్పించాలన్నారు. అవసరమైనప్పుడు మార్కెట్‌లో జోక్యం చేసుకునేందుకు ఖర్చుకు వెనుకాడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్ జోక్యం కోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ. 100 కోట్లు ఖర్చు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

రాష్ట్రంలో బియ్యం నిల్వలు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హోల్‌సేల్ వ్యాపారులు, మిల్లర్ల వద్ద ఉన్న నిల్వల వివరాలు అధికారులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని చెప్పారు. మార్కెట్ వాచ్, అగ్రి వాచ్ వ్యవస్థల ద్వారా ధరలు, సరఫరా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. నిత్యావసర సరుకులతోపాటు కూరగాయల ధరలు కూడా అదుపులో ఉండేలా రైతుబజార్లను సమర్థంగా వినియోగించుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ధరల నియంత్రణపై జిల్లాల వారీగా కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అక్రమ నిల్వలు, కృత్రిమంగా ధరలు పెంచే చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు విజిలెన్స్ నిఘా పెంచాలని వర్చువల్‌గా పాల్గొన్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీ మెప్మాకు జాతీయ నీరాజనం

అమరావతి: ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వనిధి) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. పథకం అమలు, రుణాల పంపిణీ, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహంలో ప్రతిభ కనబరిచిన రాష్ట్రానికి మొత్తం ఏడు జాతీయ అవార్డులు దక్కాయి. వీటిలో రాష్ట్రస్థాయిలో మూడు, పట్టణ స్థానిక సంస్థల విభాగంలో నాలుగు పురస్కారాలు ఉన్నాయి. వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించడంలో రాష్ట్రం సాధించిన పురోగతికి ఈ గుర్తింపు లభించింది.

ఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ జీ. బాలకృష్ణ, అదనపు మిషన్ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు, పీఎం స్వనిధి పథకం ఎస్ఎంఎం-బీఎల్ ప్రభావతి అవార్డులను అందుకున్నారు. అవార్డులు సాధించిన జిల్లాలు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

పీఎం స్వనిధి పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ మూడు విభాగాల్లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించింది. అర్హులైన వీధి వ్యాపారులకు రుణాలు అందించడంలో దేశవ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. పథకం ప్రయోజనాలను లబ్ధిదారులకు చేరువ చేసేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రథమ స్థానం



దక్కించుకుంది. పథకం అమలులోని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న సమగ్ర పనితీరు విభాగంలో మూడో ర్యాంకు సాధించింది.

రాష్ట్రంలోని నాలుగు పట్టణ స్థానిక సంస్థలు వివిధ విభాగాల్లో జాతీయ అవార్డులు అందుకున్నాయి. రుణాల పంపిణీలో కడప నగరపాలక సంస్థ రెండో స్థానం సాధించింది. స్వనిధి సే సమృద్ధి అమలులో రామచంద్రాపురం మొదటి స్థానం, అమలాపురం రెండో స్థానం దక్కించుకున్నాయి. డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహంలో విజయనగరం రెండో ర్యాంకు సాధించింది. ముఖ్యంగా స్వనిధి సే సమృద్ధి అమలులో రామచంద్రాపురం దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం విశేషం.

పీఎం స్వనిధి పథకం ప్రధాన లక్ష్యం వీధి వ్యాపారులకు సంస్థాగత రుణ సదుపాయాలు కల్పించి, వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందించడమేనని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 4,94,000 మంది వీధి వ్యాపారులకు రూ. 1,016.88 కోట్ల రుణాలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 1,34,000 మందికి రూ. 284.66 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం, వీధి వ్యాపారులను ఆర్థిక సేవల పరిధిలోకి తీసుకురావడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే పథకం ఉద్దేశమని వివరించారు. స్వనిధి సే సమృద్ధి కార్యక్రమం ద్వారా వీధి వ్యాపారులు, వారి కుటుంబాలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అనుసంధానిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రానికి ఏడు జాతీయ అవార్డులు దక్కేలా కృషి చేసిన మెప్మా డైరెక్టర్, అధికారులు, సిబ్బందిని మంత్రి నారాయణ, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. సురేష్‌కుమార్ అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా నిర్దేశంలో వీధి వ్యాపారుల ఆర్థిక స్వావలంబన, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం, స్థిరమైన జీవనోపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ అవార్డులు మరింత ప్రోత్సాహాన్నిస్తాయని పేర్కొన్నారు.

జడ్పీటీసీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగిపోగు పుల్లయ్య

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్) బ్రహ్మంగారిమ ఠం మండలం తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ నుంచి పోటీ చేసి గెలిచిన నాగిపోగు పుల్లయ్య శుక్రవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జెడ్పీటీసీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అందులో భాగంగా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రం నుంచి జెడ్పీటీసీగా నాగిపోగు పుల్లయ్య జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలో కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పరిషత్ చైర్మన్ ,వైస్ చైర్మన్ జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్, బ్రహ్మంగారిమఠం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముడుమాల పోలిరెడ్డి ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, మాజీ మండల పరిషత్ ప్రెసిడెంట్



చిలేకాంపల్లె వీరనారాయణ రెడ్డి, సెట్ బ్యాంక్ చైర్మన్ యల్లటూరు సాంబశివారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఎస్సీ సామాజిక వర్గం నుంచి నాగిపోగు పుల్లయ్య జెడ్పీటీసీగా ఎన్నిక కావడం ఎంత గర్వకారణం అని అలాగే చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని వారు ఆకాంక్షించారు. అనంతరం జడ్పీటీసీ నాగిపోగు పుల్లయ్య మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ వారికి ప్రత్యేక హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మండలంలోని ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమయంతో మెరుగైన పాలన అందిస్తానని వారు తెలిపారు. అలాగే నాకు అప్పగించిన ఈ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి



(మొదటి పేజీ తరువాయి)

సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ఎన్నికలను ప్రభావితం చేసే శక్తులపై నిరంతరం నిఘా ఉంచాలి.

స్వేచ్ఛాయుత వాతావరణం : అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకుని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలి.

వేంపల్లి గ్రామ పంచాయతీలో ప్రత్యేక ఏర్పాట్లు : వేంపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు సమగ్ర పోలీసు భద్రత కల్పించాలని కమిషనర్ సూచించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయ ప్రాంగణంలోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించడం, తప్పనిసరిగా సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించి, గౌరవ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆక్వా తుపాను ప్రభావంపై ముందస్తు జాగ్రత్తలు: శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై 'ఆక్వా తుపాను' ప్రభావం, వాతావరణ పరిస్థితుల వివరాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, ప్రతికూల వాతావరణం ఏర్పడినా ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలగకుండా విపత్తు నిర్వహణ, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పోలింగ్ సిబ్బంది, ఓటర్లు, ఎన్నికల సామగ్రి రవాణా మరియు పోలింగ్ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

యుద్ధాల వేళ.. భారత్ శాంతి సందేశం



(మొదటి పేజీ తరువాయి)

కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వాటిని వివిధ భాషల్లోకి అనువదించి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా ఎస్సీవో సభ్య దేశాలు సమష్టిగా కృషి చేయాలని అన్నారు.

సభ్య దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు పరస్పర సహకారంతో సంయుక్త పరిశోధనలు చేపట్టాలని ప్రధాని సూచించారు. తద్వారా ఉమ్మడి చరిత్రకు సంబంధించిన ఎన్నో కొత్త అంశాలను వెలుగులోకి తీసుకురావచ్చని తెలిపారు. ఒక దేశ యువత మరో దేశ చరిత్ర, సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని మరింత లోతుగా తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

ఎస్సీవో సభ్య దేశాల్లో విస్తరించి ఉన్న ప్రాచీన సిల్క్ రూట్, బౌద్ధ వారసత్వ ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక హెరిటేజ్ సర్క్యూట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని మోదీ సూచించారు. వీటిని సాంస్కృతిక పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. సంయుక్త సాంస్కృతిక ఉత్సవాలు, కళాకారుల మార్పిడి కార్యక్రమాలతో సభ్య దేశాల కళలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయవచ్చని చెప్పారు.

కార్యక్రమంలో తొలుత 'వసుధైవ కుటుంబకం.. ప్రపంచమంతా ఒకే కుటుంబం' ఇతివృత్తంతో 'సివిలైజేషన్స్ ఇన్ కన్వర్జేషన్' పేరుతో నృత్య, సంగీత ప్రదర్శనలు నిర్వహించారు. 'అస్తిత్వ.. ది ఎసెన్స్ ఆఫ్ అవర్ ఎగ్జిస్టెన్స్' పేరుతో భారత పురావస్తు, సాహిత్య వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. క్రీస్తుపూర్వం 1200 నుంచి క్రీస్తుశకం 1200 వరకు దిల్లీ చరిత్రకు సంబంధించిన తవ్వకాల్లో లభించిన వస్తువులు, నిర్మాణ అవశేషాలు, కళాఖండాలను ఇందులో ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పాల్గొన్నారు. నాగరికతలు ఒంటరిగా కాకుండా పరస్పర సంభాషణల ద్వారానే అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఫోరం అంతర్జాతీయ సహకారంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు. ఉమ్మడి వారసత్వాన్ని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

2025లో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన ఎస్సీవో శిఖరాగ్ర సదస్సులో మోదీ చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా ఈ ఫోరంను నిర్వహిస్తున్నారు. కేంద్ర సాంస్కృతిక, విదేశాంగ శాఖల ఆధ్వర్యంలో నవంబరు 20 నుంచి 22 వర

కావేరీ జలాలపై తమిళనాడుకు షాక్



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : కావేరీ నదీ జలాల పంపిణీ వివాదంలో తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కర్ణాటక నుంచి అదనంగా 11 టీఎంసీల నీటిని విడుదల చేయించాలని కోరుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్రంలో నీటి కొరతతో పంటలు దెబ్బతింటున్నాయని తమిళనాడు వాదించినప్పటికీ.. అదనపు నీటిని విడుదల చేయాలని కర్ణాటకను ఆదేశించేందుకు ధర్మాసనం నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు నిర్ణయం వెలువరించింది.

కావేరీ నదిలో తమకు రావాల్సిన నీటి వాటాను కర్ణాటక సక్రమంగా విడుదల చేయడం లేదని తమిళనాడు ప్రభుత్వం పిటిషన్లలో ఆరోపించింది. జూలై నుంచి తమకు సుమారు 11 టీఎంసీల నీరు బకాయి ఉందని పేర్కొంది. ఈ నీరు అందకపోవడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని, ముఖ్యంగా కావేరీ డెల్టా ప్రాంతంలోని పంటలు దెబ్బతింటున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ, కావేరీ జల నియంత్రణ కమిటీ ఆదేశాలు జారీ చేసినప్పటికీ తమకు రావాల్సిన నీరు అందడం లేదని వాదించింది.

తమిళనాడు వాదనలను కర్ణాటక ప్రభుత్వం వ్యతిరేకించింది. తమ రాష్ట్రంలోని పలు జిల్లాలు సైతం కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని కోర్టుకు వివరించింది. కావేరీ పరీవాహక ప్రాంతంలోని జలాశయాలకు నీటి రాక గణనీయంగా తగ్గిపోయిందని తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో అదనపు నీటిని విడుదల చేయాలని ఆదేశించడం సాధ్యం కాదని కర్ణాటక తరఫు న్యాయవాదులు వాదించారు. ఇరు రాష్ట్రాల వాదనలు పరిశీలించిన సుప్రీంకోర్టు.. తమిళనాడు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది.

జడ్పీలకు కొత్త సారథులు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో కొత్త జిల్లాల పరిధిలో తొలిసారిగా జడ్పీ ఛైర్మన్ల ఎన్నికలు నిర్వహించారు. పలు జిల్లాల్లో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లుగా ఎన్నికైన వారు ప్రమాణస్వీకారం చేశారు. కొన్ని చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి.

రాష్ట్రంలో అత్యల్ప జడ్పీటీసీ సభ్యులున్న జిల్లా పరిషత్‌గా విశాఖపట్నం నిలవగా.. అత్యధిక సభ్యులున్న జడ్పీగా కడప గుర్తింపు పొందింది. పలు జిల్లాల్లో ఎన్నికైన ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

కాకినాడ జిల్లా:జడ్పీ ఛైర్‌పర్సన్‌గా బుర్ర దివ్య సునీత, వైస్ ఛైర్‌పర్సన్‌గా పంపన రాజేశ్వరి ఎన్నికయ్యారు.

పార్వతీపురం మన్యం జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా జనసేనకు చెందిన నీలిమ, వైస్ ఛైర్‌పర్సన్‌గా తెదేపా అభ్యర్థి వీరేశ్‌చంద్ర ఎన్నికయ్యారు.

పల్నాడు జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పుచ్చకాయల రమాదేవి ప్రమాణస్వీకారం చేశారు.

విజయనగరం జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా మజ్జి సిరిసహస్ర ఎన్నికయ్యారు.

గుంటూరు జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ధార అరుణ, వైస్ ఛైర్‌పర్సన్‌గా అశోక్‌కుమార్‌గౌడ్ ప్రమాణస్వీకారం చేశారు.

చిత్తూరు జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎం.శైలజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా మంజుల ప్రియ ఎన్నికయ్యారు.

నంద్యాల జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా బృహనుద్దిన్, వైస్ ఛైర్‌పర్సన్‌గా శ్రీకాంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.

శ్రీసత్యసాయి జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పరిటాల శ్రీరామ్, వైస్ ఛైర్‌పర్సన్‌గా సునేత్ర ప్రమాణస్వీకారం చేశారు.

కర్నూలు జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉలిగయ్య, వైస్ ఛైర్‌పర్సన్‌గా షేక్ సాధిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కలెక్టర్ వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు.

ఎన్టీఆర్ జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా కోట పుల్లమ్మ, వైస్ ఛైర్‌పర్సన్‌గా బాల కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


విశాఖ జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా అలివేణి, వైస్ ఛైర్‌పర్సన్‌గా సుఖవాసి అజయ్ ప్రమాణస్వీకారం చేశారు. కలెక్టర్ వారి చేత ప్రమాణం చేయించారు.

కడప జిల్లా: జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పుత్తా నరసింహారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్‌గా హమీబున్నీసా ఎన్నికయ్యారు. కలెక్టర్ శ్రీధర్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

కొనకళ్ల త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్ష

అమరావతి, నవంబర్ 20 (జర్నలిస్ట్ ఫైల్): అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న ఆర్టీసీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత కొనకళ్ల నారాయణ ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఆయన కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం మణిపాల్ ఆసుపత్రి నుంచి హైదరాబాద్ కిమ్స్‌కు తరలిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. ధైర్యంగా ఉండాలని వారికి సూచించిన సీఎం... కొనకళ్ల నారాయణ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కొనకళ్ల నారాయణను కిమ్స్‌కు తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలపడంతో ఆ ఆస్పత్రి యాజమాన్యంతోనూ ముఖ్యమంత్రి ఫోన్లో మాట్లాడారు. కొనకళ్ల నారాయణకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.

తీరం దాటిన 'అక్వాన్' తుపాను



అమరావతి : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను శుక్రవారం ఉదయం గోపాలపూర్ సమీపంలో తీరం దాటింది. శుక్రవారం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా తీర ప్రాంతాన్ని దాటినట్లు భాతర వాతావరణ సంస్థ వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, గరిష్ఠంగా గంటకు 90 కిలోమీటర్ల వేగంతో గాలులు నమోదయ్యాయని తెలిపింది. తుపాను గంటకు 26 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా పయనించి.. ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ తీవ్ర వాయుగుండంగా బలహీనపడినట్లు పేర్కొంది. ఆ తర్వాత వాయుగుండంగా బలహీనపడుతుందని వెల్లడించింది. దీని ఫలితంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్‌ది అంకెల గారడీ

- **బకాయిల భారం రూ.3,300 కోట్లు కూటమిపై వదిలి వెళ్లారు**
- **లోకేశ్ హయాంలో అధిక నిధుల విడుదల: విజయ్‌కుమార్**



మంగళగిరి, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైఎస్ జగన్ తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అపోహలు సృష్టిస్తున్నారని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించగా, వైసీపీ పాలనలో నిబంధనల పేరుతో లబ్ధిదారుల సంఖ్యను 9 లక్షలకు తగ్గించారని ఆరోపించారు. పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేసి పేద విద్యార్థులకు అన్యాయం చేశారని విమర్శించారు.

2019-24 మధ్య జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.10,149.63 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, నెలకు సగటున రూ.169 కోట్లు చెల్లించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నెలకు రూ.250-300 కోట్ల వరకు విడుదల చేస్తోందన్నారు. గత ప్రభుత్వం రూ.2,832 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పీజీ కళాశాలలకు మరో రూ.450 కోట్లు కలిపి సుమారు రూ.3,300 కోట్ల భారాన్ని ప్రస్తుత ప్రభుత్వంపై వేసి వెళ్లిందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నాలుగు త్రైమాసికాలకు సంబంధించిన నిధులు పూర్తిగా విడుదల చేయకుండా బకాయిలు పేరుకుపోయేలా చేశారని ఆరోపించారు. ఫీజులు అందక విద్యార్థులు ఇబ్బందులు పడటంతో పాటు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు పొందలేని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విడుదల చేయించిందన్నారు.


ప్రస్తుతం నేరుగా కళాశాలల ఖాతాల్లో ఫీజులు జమ చేస్తూ విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకుంటున్నారని విజయ్‌కుమార్ తెలిపారు. విద్యా సంవత్సరానికి, ఆర్థిక సంవత్సరానికి మధ్య తేడా తెలియకుండా జగన్ తప్పుడు లెక్కలతో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా వాస్తవాలను గుర్తించాలని హితవు పలికారు.

పోలీస్ స్టేషన్‌ల్లో డేటాబేస్ ఏర్పాటు పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్): లైంగిక నేరాలపై పదేపదే ఫిర్యాదులు చేసేవారి వివరాలతో పోలీస్ స్టేషన్ల ప్రధాన కార్యాలయాల్లో డేటాబేస్ ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ప్రతి వ్యక్తికి ఫిర్యాదు చేసే హక్కు ఉందని పేర్కొంది. ఒకవేళ తప్పుడు కేసులైతే చట్ట ప్రకారం పరిణామాలు ఉంటాయని, దీంతో ఒక వ్యక్తి 100 ఫిర్యాదుల వరకు దాఖలు చేయవచ్చని భారతప్రధానన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం, నగర పోలీస్‌కమిషనర్‌కు వ్యతిరేకంగా షోనీ కపూర్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంను ధర్మాసనం తిరస్కరించింది. వ్యక్తులు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదంతాలను పరిష్కరించడానికి, ప్రతి జిల్లాలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఒక వ్యవస్థీకృత డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని పిటిషన్ పేర్కొంది. డేటాబేస్ ఏర్పాటుతో లైంగిక బాధితుల వివరాలు బహిర్గతమయ్యే ప్రమాదం ఉందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. విచారణ సందర్భంగా, బాధితులను గుర్తించడానికి, ఫిర్యాదులను నిర్ధారించడానికి ఇప్పటికే ఉన్న చట్టపరమైన వ్యవస్థ రక్షణ కల్పిస్తున్నప్పుడు, అదనపు గుర్తింపు ప్రొఫైలింగ్ అవసరం లేదని తెలిపింది. లైంగిక బాధితులకు చట్టం పలు స్థాయిల్లో గోప్యతా భద్రతను అందిస్తోందని, ఈ డేటాబేస్‌తో వారి వివరాలు బహిర్గతమయ్యే ప్రమాదం ఉందని జస్టిస్ బాగ్చి హెచ్చరించారు. బాధితుల వాంగ్మూలాలను మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేయాలని, ఇది అదనపు ధృవీకరణకు వీలు కల్పిస్తుందని చట్టం నిర్దేశిస్తోందని అన్నారు. దర్యాప్తు సంస్థ ఇంతకంటే మెరుగైన గుర్తింపు సమాచారాన్ని ఎలా నిర్వహించగలదని జస్టిస్ బాగ్చి ప్రశ్నించారు.

మలేషియాతో మరింత సన్నిహిత సహకారానికి సిద్ధం: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్



షెంజెన్:మలేషియాతో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత వేగవంతం చేసేందుకు, ఇరు దేశాల ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకు చైనా సిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టం చేశారు. శుక్రవారం దక్షిణ చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని షెంజెన్ నగరంలో మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ.. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి భవిష్యత్తుతో కూడిన ఉన్నత స్థాయి వ్యూహాత్మక 'చైనా-మలేషియా కమ్యూనిటీ' నిర్మాణంపై ఇరు దేశాల మధ్య కీలక ఏకాభిప్రాయం కుదిరిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త 'గోల్డెన్ 50 ఇయర్స్' శకానికి నాంది పలికి, ఉన్నత స్థాయి అభివృద్ధిని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యూహాత్మక మద్దతు: ఇరు దేశాలు ఉన్నత స్థాయి వ్యూహాత్మక సంప్రదింపులను కొనసాగిస్తూ, ఒకరి జాతీయ సార్వభౌమాధికారం, భద్రత మరియు అభివృద్ధి ప్రయోజనాలను కాపాడుకోవడంలో పరస్పరం మద్దతు ఇచ్చుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. కీలక రంగాల్లో విస్తరణ: ప్రధాన ప్రాజెక్టుల నాణ్యమైన అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్య విస్తరణతో పాటు పర్యాటకం, విద్యవంటి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తృతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. అంతర్జాతీయ వేదికలపై సమన్వయం: గ్లోబల్ గవర్నెన్స్ (ప్రపంచ పాలన) సంస్కరణలను ముందుకు తీసుకెళ్లాలని, అపెక్ వంటి బహుపాక్షిక వేదికలలో సమన్వయాన్ని బలోపేతం చేసి అభివృద్ధి చెందుతున్న దేశాల ఉమ్మడి ప్రయోజనాలను కాపాడాలని జిన్‌పింగ్ అన్నారు.

మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మాట్లాడుతూ.. తైవాన్ అంశం పూర్తిగా చైనా అంతర్గత విషయమని, తమ దేశం 'ఒకే చైనా' విధానానికి దృఢంగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. చైనాతో వ్యూహాత్మక సమన్వయాన్ని బలోపేతం చేసుకోవడానికి, కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సజావు నిర్వహణకు మరియు కృత్రిమ మేధ వంటి నూతన రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడానికి మలేషియా సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే, నాగరికతల మధ్య పరస్పర మార్పిడి, అంతర్జాతీయ వ్యవహారాల్లో సమన్వయంతో మలేషియా-చైనా సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

భారత తొలి స్వదేశీ బుల్లెట్ ట్రైన్‌కు ముహూర్తం ఖరారు



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):భారతదేశపు తొలి స్వదేశీ బుల్లెట్ రైలు కల సాకారం కావడానికి కీలక అడుగులు పడుతున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందుతున్న 'దీ28' బుల్లెట్ ట్రైన్ పట్టాలపైకి వచ్చే సమయం ఆసన్నమైంది. ఈ బుల్లెట్ ట్రైన్ ట్రాక్ ట్రయల్స్ 2027 మధ్య నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందని, 2027 చివరి త్రైమాసికంలో తొలి కమర్షియల్ సర్వీసు మొదలవుతుందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ముందుగా సూరత్- వాపి విభాగంలో తొలి సర్వీసును ప్రారంభిస్తామని, ఆ తర్వాత దశలవారీగా ముంబయి వరకు పూర్తి కారిడార్‌ను అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు. ఇటీవల తన సబ్‌స్టాక్ బ్లాగ్ పోస్ట్‌లో మంత్రి అశ్విని వైష్ణవ్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పురోగతిని వివరించారు. భారతదేశ తొలి బుల్లెట్ రైలు ఇప్పుడు కేవలం ఒక ప్రకటన మాత్రమే కానే కాదని, 508 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు పూర్తి వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

భారత్‌లో తయారవుతున్న ఈ తొలి బుల్లెట్ ట్రైన్‌కు దీ28 అని పేరు పెట్టారు. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ స్వదేశీ రైలును తయారు చేస్తు న్నాయి. బెంగళూరులోని బీఈఎంఎల్ తయారీ కేంద్రం లోనే రైలు నిర్మాణం జరుగు తోంది. గంటకు 280 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించేలా దీనిని రూపొందిస్తున్నారు. రైలు కు సంబంధించిన మొదటి బాడీ ఫ్రేమ్ నిర్మాణం పూర్త యిందని, ప్రస్తుతం దానికి స్ట్రక్చరల్ టెస్టింగ్ జరుగుతోందని అశ్విని వైష్ణవ్ తన సబ్‌స్టాక్ పోస్టులో తెలిపారు. 2027 మధ్యలోనే ట్రాక్ ట్రయల్స్ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దీ28 తర్వాత గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల దీ35 రైలును అభివృద్ధి చేయడం తదుపరి లక్ష్యమని వెల్లడించారు.

ఈ స్వదేశీ బుల్లెట్ ట్రైన్ మొత్తం పొడవు సుమారు 202 మీటర్లు ఉంటుంది. దీంట్లో 8 కోచ్‌లు ఉంటాయి. నాలుగు మోటార్ కార్లు, నాలుగు ట్రైలర్ కార్లతో రైలు నిర్మాణం ఉంటుంది. ఒకేసారి సుమారు 557 మంది ప్రయాణించవచ్చు. దీంట్లో 3ఇ2 సీటింగ్ అరెంజ్‌మెంట్స్‌తో 7 స్టాండర్డ్ క్లాస్ కోచ్‌లు, 2ఇ2 సీటింగ్‌తో ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్ ఉంటాయి. రైలుకు రెండు వైపులా డ్రైవర్ క్యాబిన్స్, ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమయ్యే ఇంటెలిజెంట్ ఆన్‌బోర్డ్ కంట్రోల్ సిస్టమ్‌ను కలిగి ఉంటాయి. అవసరాన్ని బట్టి రెండు 8 కోచ్‌ల రైళ్లను కలిపి 16 కోచ్‌ల రైలుగా కూడా నడపొచ్చు.

భారతీయ ప్రయాణికుల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని రైలు లోపలి భాగాల్ని రూపొందిస్తున్నారు. సౌకర్యవంతమైన సీట్లు, కాళ్లు చాపుకోవడానికి తగినంత స్థలం ఉండేలా, ఇంకా ఎల్ఈడీ లైటింగ్, పైన, కిందా లగేజీ ర్యాక్స్, ల్యాప్‌టాప్, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, అత్యాధునిక బయో డైజెస్టర్ టాయిలెట్స్, బయట ప్రకృతి దృశ్యాలను స్పష్టంగా చూసేందుకు వెడల్పుగా ఉండే కిటికీలు, ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి సులభంగా వెళ్లడానికి సీల్డ్ గ్యాంగ్‌వే వంటి సదుపాయాలను ఇందులో ఏర్పాటు చేస్తున్నారు. ముంబయి- అహ్మదాబాద్ హైస్పీడ్ ట్రైన్ కారిడార్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం రోడ్డు మార్గంలో ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 8 నుంచి 9 గంటల వరకు సమయం పడుతుండగా, బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే కేవలం గంటా 58 నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి తెలిపారు. మొదట సూరత్- వాపి మధ్యనే సేవలు ప్రారంభించి, తర్వాత మిగతా మార్గాన్ని దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ ముంబయి- అహ్మదాబాద్ హైస్పీడ్ ట్రైన్ ప్రాజెక్టును 2017 సెప్టెంబరులో ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రభుత్వం పునాది వేశాయి. ఈ ప్రాజెక్టుకు జపాన్ హైస్పీడ్ ట్రైన్ సాంకేతికతను అందిస్తోంది.

బెంగళూరులో దేశంలోనే తొలి స్పోర్ట్స్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్): : దేశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ మద్దతు గల 'స్పోర్ట్స్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను బెంగళూరులో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కర్ణాటక ప్రభుత్వం ప్రముఖ సంస్థ 'అమాగి మీడియా ల్యాబ్స్'తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది.

క్రీడా ప్రతిభను మెరుగుపరిచేందుకు పరిశోధకులు, స్టార్టప్‌లు, కోచ్‌లు మరియు క్రీడా సంస్థలతో కలిసి ఆచరణాత్మక సాంకేతిక వ్యవస్థలను అభివృద్ధి చేయడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, ఆధునిక శిక్షణా పద్ధతులు, స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ ఇండస్ట్రీ మరియు స్పోర్ట్స్ సైన్స్ వంటి అంశాలపై ఈ కేంద్రంలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

మీడియా మరియు వినోద రంగాలకు క్లౌడ్ ఆధారిత సాంకేతిక సేవలను అందించడంలో అమాగి సంస్థకు విశేష అనుభవం ఉంది. క్రీడా రంగానికి సంబంధించిన నూతన సాంకేతిక ఆవిష్కరణలలో కూడా ఈ సంస్థకు మంచి పట్టు ఉండటంతో, కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం అమాగితో చేతులు కలిపింది.

అమరావతిలో ఐస్‌లాండ్ బృందం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): రాజధాని అమరావతి నిర్మాణ ప్రణాళిక, ఆర్కిటెక్చర్, సుస్థిర పట్టణాభివృద్ధిని ఐస్‌లాండ్ ప్రతినిధి బృందం శుక్రవారం పరిశీలించింది. అమరావతిలోని రాయపూడి సిఆర్‌డిఏ కార్యాలయానికి వచ్చిన బృందానికి చీఫ్ ఆర్కిటెక్ట్ సందీప్ దీక్షిత్, సీనియర్ ఆర్కిటెక్ట్‌లు ప్రసున్న, సుమిత్ర స్వాగతం పలికారు. అనంతరం సిఆర్‌డిఏ అదనపు కమిషనర్, ఎజిఐ సిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ కుమార్ అమరావతి నిర్మాణ ప్రణాళికపై కార్యాలయంలోని అమరావతి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఎఐసిసిసి)లో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాజధాని అమరావతి లక్ష్యాలు, బ్లూ-గ్రీన్ మాస్టర్ ప్లాన్, నగర నిర్మాణ రూపకల్పన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలను వివరించారు. ఫోస్టర్ ప్లస్ పార్ట్‌నర్స్‌కు చెందిన జెన్(అలెక్స్) కియాన్, హరిత శాసనసభ, హైకోర్టు, ఇంటిగ్రేటెడ్ సెక్రటేరియట్ భవనాల డిజైన్, నిర్మాణ రూపకల్పన ప్రత్యేకతలను తెలిపారు. సెంట్రల్ పార్క్ అభివృద్ధి ప్రణాళికపై ప్రతినిధి బృందానికి చెందిన సీనియర్ ఆర్కిటెక్ట్ సాహిత్య వివరించారు. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఎన్‌జె గ్రూప్ తరఫున ప్రోగ్రామ్ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ మను చౌదరి, ఆర్కిటెక్ట్ అశ్విన్ పొంగూరు, ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్ట్ కీర్తి చంద్ర... ప్రాజెక్టుల అమలు, వివిధ మౌలిక వసతుల సమన్వయం, ల్యాండ్‌స్కేప్ ప్రణాళికలను తెలియజేశారు. అనంతరం ఈ బృందం అమరావతిలోని ఐకానిక్ టవర్లు, శాసనసభ సముదాయం, హైకోర్టు, క్వాంటం వ్యాలీని సందర్శించింది.

ముక్కా ముత్యాల నాయుడు మృతి పట్ల ముఖ్యమంత్రి సంతాపం

అమరావతి, నవంబర్ 20 (జర్నలిస్ట్ ఫైల్): విశాఖ మేయర్ ముక్కాశ్రావణి తండ్రి, టీడీపీ సీనియర్ నాయకులు ముక్కా ముత్యాలనాయుడు గుండెపోటుతో మరణించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చ్టటటశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. ముక్కా శ్రావణికి ఫోన్ చేసి పరామర్శించారు. కార్పొరేటర్‌గా ముత్యాలనాయుడు విశాఖ ప్రజలకు, పార్టీకి అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. శ్రావణి కుటుంబ సభ్యులతోనూ మాట్లాడిన ముఖ్యమంత్రి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. ముత్యాలనాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

శబరిమల దర్శనానికి క్యూ బుకింగ్ తప్పనిసరి



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తులందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్ వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకోవాలని కేరళ పోలీసులు స్పష్టం చేసినట్లు రాష్ట్ర డిజిపి కార్యాలయం తెలిపింది. రోజుకు గరిష్ఠంగా 80 వేల మందికే దర్శనానికి అనుమతి ఉంటుందని రాష్ట్ర డిజిపి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో పంపాలో ఉన్న స్పాట్ బుకింగ్ కేంద్రాలను నిలక్కల్‌కు తరలించినట్లు వెల్లడించిందని పేర్కొంది. స్పాట్ బుకింగ్ కోరుకునే భక్తులు నిలక్కల్‌లోనే నమోదు చేసుకోవాలని, రోజుకు 10 వేల మందికి ఈ సౌకర్యం ఉంటుందని తెలిపింది. ఎరుమేలి, పంపా, వండిపెరియార్, పుల్లుమేడు అటవీ మార్గాల్లో వెళ్లేవారికి ఆన్‌లైన్ , స్పాట్ బుకింగ్ తప్పనిసరి అని పేర్కొంది. ఈ మార్గాల్లో రోజుకు 2 వేల మందికి స్పాట్ బుకింగ్ కల్పించనున్నారని తెలిపింది. పంపాలో పార్కింగ్ పరిమితంగా ఉన్నందున ప్రయివేటు వాహనాలను నిలక్కల్‌లో పార్క్ చేసి కెఎస్ ఆర్ టిసి

బొమ్మిశెట్టి సత్యనారాయణ దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులర్పించిన కర్నాటి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్



ఖమ్మం, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం కార్పొరేషన్ 14వ డివిజన్ కొత్తగూడెం గ్రామ వాస్తవ్యులు బొమ్మిశెట్టి సత్యనారాయణ దశదిన కార్యక్రమంలో పాల్గొని, వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకన్న, మాటేటి కిరణ్, షేక్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలుగా గా ఉద్యోగున్నతి పొందిన ఇద్దరు మహిళ పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



ఖమ్మం, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : వివిధ పోలీస్ స్టేషన్ లలో ఏఎస్సైలుగా నిరంతరంగా సేవలందించిన ఎస్ డి సలీమాబేగం, టి. నాగరాజా కుమారి ఎస్సైలుగా ఉద్యోగున్నతి లభించింది. ఈ ఇద్దరు మహిళ పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గురువారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు.

నమ్మకమైన సర్వే సేవలు అందించాలి

: తహశీల్దార్ పి.రాంప్రసాద్



నేలకొండపల్లి, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్):ప్రజలకు నమ్మకమైన సర్వే సేవలను అందించాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. లైసెన్స్ సర్వేయర్ సి. హెచ్.వీరబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్వేయర్ కార్యాలయం ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. భూ సర్వే కు సంబంధించిన సేవలు ఇక పై మండల ప్రజలు స్థానికంగానే సులభంగా అందుతాయన్నారు. భూముల కొలతలు, హద్దులు, ప్లాట్ల విభజన వంటి సమస్యల కు పరిష్కారం చూపే కేంద్రంగా కార్యాలయం నిలవాలని, సూచించారు. ప్రజలకు నమ్మకమైన, పారదర్శకమైన సర్వే సేవలు అందించేందుకు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధపంచాయతీల సర్పంచ్ లు కట్టెకోల నాగార్జున, గుండపనేని లక్ష్మణావు, ఐకేపీ సీసీ పెద్దపాక వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్లు చిలకబత్తిని వీరబాబు, మామిడి వెంకన్న, మైశా శంకర్, జెర్రిపోతుల సత్యనారాయణ, కట్టెకోల వెంకటేశ్వర్లు, చింతలపాటి భాస్కర్, కుర్రి నాగరాజు, సయ్యద్ భాసిం, మార్తి వీరన్న, నరసింహాచారీ, శేషగిరి, కట్టెకోల చిన్ని కృష్ణ, గునగంటి రామూర్తి తదితరులు పాల్గొన్నారు

వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- పాఠ్యాంశాల్లో ప్రావీణ్యం పెంపొందించుకొని, క్రీడల వైపు మొగ్గు చూపాలి
- వైరా మండలంలోని వెనుకబడిన తరగతుల వసతీ గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





ఖమ్మం, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :

వసతీగృహాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం వైరాలోని తెలంగాణ వెనుకబడిన తరగతుల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న వసతులను, భోజన ఏర్పాట్లను, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించే విధానం, వంటశాలలో పాటిస్తున్న పరిశుభ్రత, వంటకు ఉపయోగిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం స్టోర్ రూమ్ను తనిఖీ చేసి నిల్వ ఉంచిన కూరగాయలు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, పండ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాలను ఎంతకాలం నిల్వ ఉంచుతున్నారు, వాటి నాణ్యతను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారు అనే విషయాలను సంబంధిత సిబ్బందిని నుంచి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా.. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి భోజనం పెడుతున్నారా అనే వివరాలను ఆరా తీసారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం అందిస్తున్న స్నాక్స్, నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ సమతుల్యమైన, పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వంటశాల పరిసరాలు, ఆహార పదార్థాల నిల్వ గదులను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు తాజా కాయకురాలు, నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. ఆహార పదార్థాలను అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వంట చేసే సమయంలోనూ, భోజనం వడ్డించే సమయంలోనూ పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా, ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అదేవిధంగా విద్యార్థులకు నిరంతరం శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు అందించే ఆహారం, తాగునీరు, వసతి సౌకర్యాల విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని, పట్టుదలతో ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని సూచించారు. అదేవిధంగా క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా రాణించాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి.జ్యోతి, వైరా తహసీల్దారు సురేష్, సంబంధిత అధికారులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి కి సీపీఐ నేతల చేయూత

- వీల్‌చైర్‌అందజేత
- భారత కమ్యూనిస్టు పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వరద నరసింహారావు



ఖమ్మం, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :

రెండు కాళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ఓ దివ్యాంగుడికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు.ఖమ్మం నగరంలోని శ్రీరామ్ హిల్స్, రోడ్ నెంబర్ 13 ప్రాంతంలో నివాసం ఉంటున్న ఉప్పలయ్య అనే వ్యక్తికి రెండు కాళ్లు లేకపోవడంతో నిత్యకృత్యాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయాన్ని స్థానిక సీపీఐ నాయకులు పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వరద నర్సిరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఉప్పలయ్య దీనస్థితిపై స్పందించిన వరద నర్సిరావు, మానవతా దృక్పథంతో అతనికి ఒక వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు ఉప్పలయ్య మాట్లాడుతూ తన కష్టాన్ని గుర్తించి తక్షణమే స్పందించి వీల్‌చైర్ అందించిన సీపీఐ నాయకులు, వరద నరసింహారావులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో మాడుగుల నాగేశ్వరావు,మెండి శ్రీను, పునారపు ఉపేందర్, కృష్ణ, మోజి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రముఖుల భాగస్వామ్యం

- పుస్తక పఠనాన్ని నిత్య అలవాటుగా మార్చేందుకు గ్రంథాలయ చైర్మన్ యండి.ఖాదర్ బాబా సభ్యత్వాల అందజేత
- 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం



ఖమ్మం, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :

జిల్లా గ్రంథాలయ సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయం (డీసీఎల్), ఖమ్మంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర్ షేక్, నాగండ్ల మాధవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చంద్రిక, చెల్లా ప్రతిభా రెడ్డి, వొయ్యూరి ఝాన్సీ తదితరులకు చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా స్వయంగా గ్రంథాలయ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పుస్తక పఠనం కేవలం ఒక అలవాటుగా కాకుండా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని ఆకాంక్షించారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్ల వినియోగానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్న నేపథ్యంలో, పుస్తక పఠనానికి కూడా ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు. గ్రంథాలయ సభ్యత్వం పొందడం ద్వారా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వివిధ రంగాలకు చెందిన పుస్తకాలను క్రమం తప్పకుండా చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహన పెంపొందుతాయని పేర్కొన్నారు. గ్రంథాలయ సభ్యత్వాలు పొందిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలను చదివే అలవాటును కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోట నీలిమకు ఓవైసీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- సనత్ నగర్ కాంగ్రెస్ శ్రేణులు



బేగంపేట్, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమపై ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన అనుచిత వ్యాఖ్యలను సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఒక మహిళా నాయకురాలిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయాల్లో హుందాతనానికి విరుద్ధమని, ప్రజా జీవితంలో ఉన్న మహిళల గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడటం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.నీలిమపై అసదుద్దీన్ చేసిన వ్యాఖ్యలకు గాను క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బేగంపేట్ రసూల్‌పుర చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఓవైసీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యల చుట్టూ ఉండాలే తప్ప వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం తగదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మహిళా నాయకురాలిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయ డం ఓవైసీ రాజకీయ సంస్కారాన్ని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. నీలిమ పై చేసిన వ్యాఖ్యలను అసదుద్దీన్ ఓవైసీ వెంటనే ఉపసంహరిం చుకోవాలని, ఆమెకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహిం చబోమని స్పష్టం చేశారు. మహిళల గౌరవం, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు విశాల్ సూదం, త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ల తోపాటు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సైబరాబాద్ మూవ్స్-2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి

- సురక్షిత రహదారులు, మెరుగైన రవాణా వ్యవస్థ నిర్మాణానికి పిలుపు



శేర్లింగంపల్లి, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ నగరంలో సురక్షిత రహదారులు, మెరుగైన రవాణా సౌకర్యాలు, సుస్థిర రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సైబరాబాద్ మూవ్స్-2026 కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి పాల్గొన్నారు. నగర భవిష్యత్తు రవాణా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని, ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన రవాణా వ్యవస్థను నిర్మించాలని ఈ కార్యక్రమం పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌తో పాటు పోలీస్, ట్రాఫిక్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ప్రజల్లో రవాణా భద్రతపై అవగాహన పెంపొందించడం, పర్యావరణహిత ప్రయాణ విధానాలను ప్రోత్సహించడం, పెరుగుతున్న నగర అవసరాలకు తగిన నూతన రవాణా పరిష్కారాలను అన్వేషించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.నవంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు రాయదుర్గంలోని టీ-హబ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో ప్రజలు, విద్యార్థులు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ ఆలోచనలు, సూచనలు పంచుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు [https://cyberabadmoves.in] (https://cyberabadmoves. in?utm_sourceRchatgpt.com) వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సూచించారు. సురక్షితమైన, మెరుగైన రవాణా వ్యవస్థ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.

ఆక్రమణల చెర వీడిన పార్కు స్థలం

- స్థానికుల ఫిర్యాదు.. హైడ్రా యాక్షన్
- నాగారంలో హైడ్రా కూల్చివేతలు





కీసర, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం నాగారం పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఆక్రమణలపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించారు. కాలనీలోని సర్వే నంబర్ 414/105లో ప్రజల అవసరాల కోసం కేటాయించిన పార్కు, ఓపెన్ స్పేస్ స్థలాలు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులను పరిశీలిం చారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించుకున్న అనంతరం, గురువారం కీసర పోలీసుల భారీ బందోబస్తు సహకారంతో కూల్చివేతలు చేపట్టారు. పార్కు స్థలాన్ని ఆక్రమిస్తూ అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను జేసీబీల సాయంతో నేలమట్టం చేశారు. 2016లో కాలనీలో 1,127 గజాల పార్కు స్థలంతో పాటు 1,797 గజాల ఓపెన్ స్పేస్ - వెరసి మొత్తం 2,924 గజాల స్థలం ఆక్రమణకు గురైందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీల్లో ప్రజల ఆహ్లాదం, అవసరాల కోసం కేటాయించిన పార్కులు, ఓపెన్ స్పేస్‌లు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ స్థలాలను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

దేశ చరిత్రలో ఇందిరాగాంధీది

చెరగని ముద్ర

- పేదల సంక్షేమం, దేశ సమగ్రత కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం : మైనంపల్లి హనుమంతరావు



మల్కాజిగిరి, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : భారతదేశ తొలి మహిళా ప్రధానిగా దేశానికి విశేష సేవలందించిన భారతరత్న ఇందిరాగాంధీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతతో పాటు పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా గురువారం మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఇందిరాగాంధీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. దేశ ఐక్యతకు భంగం కలగకుండా ఆమె చూపిన ధైర్యం, పాలనా దక్షత ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు పేద ప్రజలకు అండగా నిలవడం, సామాజిక న్యాయం కోసం పోరాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, రాజ్ జితేంద్రనాథ్, ఏకే మురుగేష్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, జీఎన్‌వీ సతీష్ కుమార్, ఉపేందర్ రెడ్డి, పిట్టల శ్రీనివాస్, సంతోష్ రాందాస్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, పిట్టల నాగరాజు, మంద భాస్కర్, రొట్టెల ధరణ్ కుమార్, యూసుఫ్, రాఘవన్, లక్ష్మి, కపిలేశ్వర్, రామచందర్, జీడి చరణ్ జిత్ గౌడ్, ఆశా, సుమలత, ఇందిరా ప్రియదర్శిని, శారద, జీవన్ రెడ్డి, చెన్నారెడ్డి, బాలరాజు యాదవ్, పార్థసారథి, బుజ్జన్న, బాబు, నత్యనారాయణ, శ్రీరాములు యాదవ్, వెంకన్న, ఇస్తారి, కుట్టి శ్రీనివాస్ యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ప్రమాద బీమా పథకంపై

విస్తృత అవగాహన కార్యక్రమం



మణికొండ, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కేవలం రూ.20 ప్రీమియం చెల్లించి ప్రమాద బీమా సౌకర్యాన్ని పొందవచ్చని బ్యాంకు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మణికొండ యూనియన్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంకుల ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజలకు ప్రధానమంత్రి ప్రమాద బీమా పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరి ప్రమాద బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మనికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మనికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు శ్రవణ్, నెక్నాంపూర్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ప్రభావతి, మనికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సావిత్రి తదితరులతో పాటు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చిన్నారుల సందడి

- ఆటపాటలతో బాలల దినోత్సవ వేడుకలు



రంగారెడ్డి జిల్లా నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా, శిశు,వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో వివిధ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగిం ది.ఈ వేడుకలకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రేమలతా అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఉద్దేశించి ప్రసంగించారు.పిల్లలే దేశ భవి ష్యత్తు అని,ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పోష కాహారం,రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొ న్నారు.బాలల హక్కులను పరిరక్షిస్తూ వారి సమగ్ర అభివృ ద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపుని చ్చారు. వివిధ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలు, శిశు సంరక్షణ సంస్థలు,బాల రక్షా భవన్‌కు చెందిన చిన్నారులు ఉత్సాహం గా పాల్గొన్నారు. పాటలు, నృత్యాలు, నాటికలు, ప్రసంగాల తో తమ ప్రతిభను ప్రదర్శించి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు.బాలల హక్కులు, రక్షణ, ఆరోగ్యం, పోషణ, విద్య,ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేం దుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నిర్వహిం చిన చిత్రలే ఖనం, వ్యాసరచన, పాటలు,క్రీడా పోటీల్లో విజేతలైన చిన్నా రులకు బహుమ తులు అందజేశారు. పిల్లల్లో సృజనాత్మ కత, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన పెంపొందిం చేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం చిన్నా రులకు స్వీట్లు,పండ్లు పంపిణీ చేసి వేడుకలను ముగిం చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ప్రేమలతా అగర్వాల్,సైబరాబాద్ మహిళా భద్రతా విభాగం డీసీపీ కట్టా శ్రీదేవి,జిల్లా విద్యాధికారి పూర్ణచందర్,జిల్లా వైద్య ఆరోగ్య అధికారి,జిల్లా కార్మిక అధికారి వెన్నెల,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు రవి,బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ కట్టా నరేందర్ రెడ్డి,జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు వాసు,సీడబ్ల్యూసీ సభ్యులు,బాల రక్షా భవన్ కో-ఆర్డినేటర్ రోజా,జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్, సీడీపీఓలు,సఖి ఇన్‌చార్జి అధికారి జ్యోత్స్న,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పిల్లలు,శిశు సంరక్షణ సంస్థల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు : జిల్లా మైనింగ్ ఆర్ ఐ నాగమణి



మేడ్చల్, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపట్టి, అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ ఆర్ ఐ నాగమణి హెచ్చరించారు. జిల్లా ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు గురువారం మేడ్చల్ రెవెన్యూ పరిధిలోని గుండ్లపోచంపల్లి జాతీయ రహదారిపై జరుగుతున్న సెల్లార్ నిర్మాణ పనులను మైనింగ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపట్టి, తవ్విన మట్టిని బయటకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ మట్టి తవ్వకాలు, రవాణా చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారి స్పష్టం చేశారు. నిబంధనలకు లోబడి మాత్రమే తవ్వకాలు చేపట్టాలని ఈ సందర్భంగా హెచ్చరించారు.

శంభీపూర్ రాజు నివాసంలో అయ్యప్ప పడిపూజ

- ముఖ్య అతిథులుగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి హరీష్ రావు



కుత్బుల్లాపూర్, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ సర్కిల్ శంభీపూర్ లోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు (కన్నె స్వామి) నివాసంలో అరుణ్ గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహా పడిపూజకు ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్,శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్, జగదీశ్వర్ రెడ్డి,మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ రావు,శాసనమండలి ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్సీ మధుసూ దనాచారి తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాలోని చిన్న నీటి చెరువులన్నింటినీ వీబీజీ రామ్‌జీ ద్వారా పునరుద్ధరించాలి

- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



నల్లగొండ, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : నల్లగొండ జిల్లాలోని చిన్న నీటి చెరువులన్నింటినీ వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనర్ ఇరిగేషన్ ఇంజనీరింగ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పరిధిలో వీబీజీ రామ్‌జీ కింద చేపట్టనున్న పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీరు కేవలం తాగునీటి అవసరాలకే సరిపోతుందని, మూసీ నదిలో నీరు ఉన్నప్పటికీ అది తాగడానికి అనుకూలంగా లేదని తెలిపారు. అందువల్ల అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించుకోవడంతోపాటు వర్షపు నీటిని చెరువుల్లోకి మళ్లించి భూగర్భ జలాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.వివిజి రామ్‌జీ కింద పెద్ద ఎత్తున చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని, ఇప్పటికే గుర్తించి మంజూరు చేసిన పనులన్నింటినీ శుక్రవారం నుంచే ప్రారంభించాలని ఆదేశించారు. ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత, శిఖం భూముల హద్దుల్లో కందకాల తవ్వకం, ఒండ్రుమట్టి తొలగించే ప్రాంతాల్లో ముళ్లపొదల తొలగింపు వంటి పనులు చేపట్టాలన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు ప్రారంభించాలని సూచించారు.ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని, అన్ని చెరువులకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ సరిహద్దులను పరిరక్షించే బాధ్యత ఇరిగేషన్ శాఖపై ఉందని స్పష్టం చేశారు. చెరువుల పునరుద్ధరణతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలా లు పెరగడంతోపాటు చెరువులు పటిష్టమవుతాయని, ఫీడర్ ఛానళ్లు, ఫీల్డ్ ఛానళ్లు బాగుపడతాయని తెలిపారు. భవిష్యత్తులో వర్షాలు కురిసినప్పుడు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకుని సంరక్షించు కోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. అదేవిధంగా వివిజి రామ్‌జీ కింద గ్రామాల్లో పశువుల తొట్ల నిర్మాణం, పశుగ్రాసం పెంపకం చేపట్టాలని ఆదేశించారు. 50 శాతం నీరు, తేమ అందుబాటులో ఉన్న చెరువుల కింద పశుగ్రాసం సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ చివరి వరకు నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో పశు గ్రాసం పెంపకానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు.ఈ సమావే శంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంత తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ అధికారులు



గరిడేపల్లి నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :
అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గరిడేపల్లి మండలం సీతా తండాలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా నాటుసారా తయారీకి సంబంధించిన ముడిసరుకును గుర్తించి ధ్వంసం చేశారు.ఈ తనిఖీల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 300 లీటర్ల బెల్లం పానకం తో పాటు నిల్వ ఉంచిన 10 లీటర్ల నాటుసారాను అధికారులు ధ్వంసం చేశారు. అలాగే నాటుసారా తయారీకి ఉపయోగిస్తున్న డిస్టిలేషన్ సెటప్‌లు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, విక్రయం, వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా కుటుంబాల ఆర్థిక పరిస్థితికి, సమాజ శాంతిభద్రతలకు కూడా హానికరమని తెలిపారు. ఎక్కడైనా అక్రమ నాటుసారా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజే యాలని కోరారు. ప్రజల సహకారంతో నాటుసారా రహిత, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నీ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ నంద్యాల శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పుట్ట శ్రీను, ప్రభాకర్, గోపిరెడ్డి, చిన్ని పాల్గొన్నారు.

సర్పంచ్ డోకూరి సునీతా ప్రభాకర్ రెడ్డి దాతృత్వం.. ఎంపీడీవో కార్యాలయానికి ప్రింటర్ బహూకరణ

- సొంత నిధులతో రూ. 25 వేల విలువైన ప్రింటర్ అందజేత
- అభినందించిన ఎంపీడీవో సీతారామమ్మ



తలకొండపల్లి, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :

తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయ అవసరాల నిమిత్తం పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీతా ప్రభాకర్ రెడ్డి దాతృత్వం చాటుకున్నారు. తన సొంత వ్యయంతో సుమారు రూ.25 వేల విలువ చేసే నూతన ప్రింటర్‌ను కొనుగోలు చేసి ఎంపీడీవో సీతారామమ్మకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామమ్మ మాట్లాడుతూ..కార్యాలయంలో రోజువారీ అధికారిక పనులు, దరఖాస్తులు, రికార్డుల నిర్వహణకు ప్రింటర్ అవసరం ఎంతో ఉండేదని తెలిపారు. సర్పంచ్ స్పందించి సొంత నిధులతో దీనిని సమకూర్చడం అభినందనీయమన్నారు.దీనివల్ల ప్రజలకు మరింత వేగంగా, మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ సునీతా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..కార్యాలయానికి వచ్చే ప్రజలకు,సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే ప్రింటర్‌ను అందజేశానని చెప్పారు. భవిష్యత్తులోనూ మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, వార్డు సభ్యులు జోగు విజయ్, బురిగల్ల రమేష్, ఎండీ వాజీద్,నాయకులు జనిగే నరసింహా, చౌటి జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు.

- దేశ చరిత్రలో చెరగని ముద్ర. ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం!
- ఘనంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు భరోసా.



జన్నారం, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :

దేశ తొలి మహిళా ప్రధానమంత్రి, దివంగత ఇందిరాగాంధీ జయంతి వేడుకలు గురువారం జన్నారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారుఅనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్ మాట్లాడుతూ దేశ సమగ్రత, అభివృద్ధి,ప్రజా సంక్షేమం కోసం ఇందిరాగాంధీ అందించిన సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు.దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఇందిరాగాంధీ ధైర్యసాహసాలు, ప్రజాహిత నిర్ణయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కుటుంబ పెద్దలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ఇందిరాగాంధీ జయంతి రోజున ప్రారంభించుకోవడం ప్రతి కుటుంబానికి భరోసాన్నిచ్చే విషయమని ఆయనతెలిపారు.పేద,మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో కాంగ్రెస్ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇసాక్,జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ముజఫర్ అలీ ఖాన్,మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ వైస్ చైర్మన్ సయ్యద్ ఫసివుల్లా, మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం,పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్ టీజీ పల్లె సర్పంచ్ కుదిరె వెంకన్న,మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్ మామిడిపల్లి ఇందయ్య ముత్యం రాజన్న రమేష్. గంగయ్య స్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్వాయిలో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ.

గుర్రంపోడు, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :



గుర్రంపోడు మండల పరిధిలోని పాల్వాయి గ్రామంలో గురువారం అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన 'చేయూత' పింఛన్ల పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ,ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలు,వృద్ధులు, వితంతువులకు అండగా నిలిచేందుకు చేయూత పింఛన్లను అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు మంచికంటి ప్రసాద్,పంచాయతీ కార్యదర్శి యాదయ్య,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి పోరాట స్ఫూర్తితో యువత దేశ నిర్మాణంలో ముందుండాలి టిఎస్ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మీనివాస్.

రాజేంద్రనగర్, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) :



తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టిఎస్ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎం.లక్ష్మీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎం.లక్ష్మీనివాస్ మాట్లాడుతూ..ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్యసాహసాలు, త్యాగనిరతి,దేశభక్తి నేటి యువతకు గొప్ప ఆదర్శమని అన్నారు.విద్యార్థి దశ నుంచే యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత,నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని,వారి స్ఫూర్తితో దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.ముఖ్యంగా విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని, మహిళా సాధికారతకు యువత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.విద్యార్థుల్లో చైతన్యం,దేశభక్తి,సామాజిక స్పృహ పెంపొందించడమే టిఎస్ఎస్ ఓ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ ఓ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ గౌడ్,రాజేంద్రనగర్ మండల కమిటీ నాయకులు,కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా టీ-10 క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామర్తి గోపి ఏకగ్రీవ ఎన్నిక



నిజామాబాద్, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ గ్రౌండ్‌లో జిల్లా టీ-10 క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామర్తి గోపిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా తెలంగాణ టీ-10 క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ దోమల నవీన్ కుమార్,నిజామాబాద్ జిల్లా సెక్రటరీ సంతోష్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రామర్తి గోపికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రామర్తి గోపి మాట్లాడుతూ..జిల్లాలో క్రికెట్ క్రీడ అభివృద్ధికి,యువ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తానని తెలిపారు.

మినీ ట్యాంక్ బండ్ నిర్వహణను కార్పొరేషన్ కి అప్పగించండి

- ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ సమావేశం..



నిజామాబాద్, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : ఇందూరులోని రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్ నిర్వహణను కార్పొరేషన్ అధికారులకు అప్పగించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ సూచించారు.గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....మినీ ట్యాంక్ బండ్ పై మరమ్మత్తులు చేయించి,వాటి నిర్వహణను కార్పొరేషన్ అధికారులకు అప్పగించాలని తెలిపారు.నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించిన మినీ ట్యాంక్ బండ్ పై సకల సౌకర్యాలు కల్పించాలన్నారు.వీలైనంత తొందరగా అప్పగించాలని ఆదేశించారు. కమిషనర్ తో భేటీ....మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ తో ఎమ్మెల్యే భేటీ అయ్యారు.ప్రధానంగా బోధన్ రోడ్ లో గల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పరిస్థితి,పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద వెజ్ నాన్ వెజ్ మార్కెట్,అమ్మ వెంచర్ సమీపంలో బ్రిడ్జి ప్రతిపాదనలు తదితర అంశాలపై చర్చించారు.నగరంలోని రోడ్లపై ప్యాచ్ వర్క్,రూ.5 కోట్ల స్పెషల్ ఫండ్ స్టేటస్ ను అడిగి తెలుసుకున్నారు.

మంథని ఫోటోగ్రాఫర్ చిత్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు

- అంతర్జాతీయ ఫోటో పోటీలో తూర్పాటి సత్యనారాయణ ఛాయాచిత్రానికి ప్రత్యేక ప్రశంస



మంథని, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్) : అంతర్జాతీయ ఫోటోగ్రఫీ వేదికపై మంథని పట్టణానికి చెందిన ఫోటోగ్రాఫర్ తూర్పాటి సత్యనారాయణ తన ప్రతిభను చాటుకున్నారు. రవి వర్మ ఫోటో స్టూడియో యజమానిగా సుపరిచితులైన ఆయనకు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఫోటో పోటీలో అరుదైన గుర్తింపు లభించింది. ఫ్రాన్స్, ఇటలీ, మొనాకో దేశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'రామోగే ఫోటో కాంటెస్ట్–2026' (ది మ్యాన్ అండ్ ది సీ) పోటీలో ఆయన చిత్రానికి ప్రత్యేక ప్రస్తావన దక్కింది.ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి వేలాది మంది ఫోటోగ్రాఫర్లు తమ చిత్రాలను ఈ పోటీకి పంపగా, సత్యనారాయణ తీసిన 'బోండా మహిళ తాగుతోంది' అనే చిత్రం అంతర్జాతీయ జ్యూరీ దృష్టిని ఆకర్షించింది. సముద్రంతో మనిషికి ఉన్న అనుబంధం, గిరిజన మహిళ జీవనశైలిని సహజత్వం ఉట్టిపడేలా తన కెమెరాలో బంధించిన తీరు ఈ ప్రత్యేక గుర్తింపునకు కారణమైంది. స్థానిక జీవన చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయడం ద్వారా ఆయన మంథని ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.ఈ పోటీ అవార్డుల ప్రదానోత్సవం డిసెంబర్ 4న మొనాకోలోని ప్రపంచ ప్రఖ్యాత ఓషనోగ్రాఫిక్ మ్యూజియంలో నిర్వహించనున్నారు. ఈ వేడుకకు అంతర్జాతీయ జ్యూరీ సభ్యులు హాజరై ఎంపికైన ఫోటోగ్రాఫర్లను సత్కరించనున్నారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. మంథని వంటి చిన్న పట్టణం నుంచి అంతర్జాతీయ వేదికపై తన ఫోటోకు గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవం తనకే కాకుండా తెలంగాణ ఫోటోగ్రఫీ రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన సాధించిన ఈ ఘనతపై మంథని పట్టణ ప్రజలు, ఫోటోగ్రాఫర్లు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

ఓపీఎస్‌కు మార్పుపై పోలీస్ సిబ్బంది హర్షం



- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు కృతజ్ఞతలు
- అర్హులకు పెన్షన్ ప్రయోజనాలు అందేలా చర్యలు


గుంటూరు, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): సీపీఎస్ నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)కు మారేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడంపై పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. 2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికై ప్రస్తుతం పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పలువురు కానిస్టేబుళ్లు గురువారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్ఐ శ్రీహరి రెడ్డి సమక్షంలో ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి, తమకు ప్రయోజనం కలిగించే నిర్ణయానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పాత పెన్షన్ విధానానికి మార్పు తమకు ఎంతో మేలు చేకూరుస్తుందని ఈ సందర్భంగా సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అర్హులైన పోలీస్ సిబ్బందికి పాత పెన్షన్ విధానం ద్వారా న్యాయపరంగా లభించాల్సిన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరి సర్వీస్ బుక్‌లో అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయించి, సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి న్యాయబద్ధమైన హక్కుల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జయంతి ఉత్సవాలు ప్రారంభం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సన్నిధిలో వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ ఆలయ సిద్ధాంతి ఇడమకంటి జనార్దనాచార్యులు ప్రధాన అర్చకులు వీరబ్రహ్మయాచారి ఆధ్వర్యంలో నేటి ఉదయం సతీసమేతంగా మహాగణపతి పూజతో జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి అష్టాదశోత్తర చతుశ్శత (418) జయంతి మహోత్సవాలు ప్రారంభించిన మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారు. తొలుత పూర్వపు మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి వారికి నమస్కరించి తదుపరి స్వామి దర్శనం పూజ తర్వాత ఉమాదేవి తో కలిసి మహాగణపతి పూజ, గోపూజ చేసి జయంతి వేడుకలు ప్రారంభించిన మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారు. మఠాధిపతి దంపతులకు వస్త్రాలు సమర్పించిన మేనేజర్ పిపిఎన్ ప్రసాద్. ఈ కార్యక్రమంలో మఠాధిపతి సోదరులు దత్తాత్రేయ స్వామి వీరంభట్లయ్య స్వామి సహా మఠం సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ప్రజల గుండెచప్పుడు ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే నసీర్

- ప్రతి సమస్యకూ పరిష్కారమే లక్ష్యం
- తూర్పు నియోజకవర్గంలో ప్రతి రోజూ ప్రజాదర్బార్
- ప్రజలకు అందాల్సిన సేవల్లో రాజీ లేదు
- ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటాం
- ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): ప్రజాదర్బార్ ప్రజల గుండెచప్పుడు వినే గొప్ప వేదిక అని, రాష్ట్రంలో త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు.

ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని తెలిపారు. ప్రజాదర్బార్ కు వెళితే తమ సమస్యలు పరిష్కరించేందుకు భరోసా నిలుస్తుందనే నమ్మకం కలిగించామని చెప్పారు. తమ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఎక్కువగా పింఛన్లు, ఇంటి స్థలాలు, శానిటేషన్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు వచ్చాయని, సంబంధిత అధికారులకు అర్జీలను పంపించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. పింఛన్ల కోసం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే అర్హులైన వారిని గుర్తించామన్నారు.

అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించే విధంగా పటిష్ట ప్రణాళిక రూపొందించుకోబోతున్నామని చెప్పారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ. 4000 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు.

అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.

కేవలం రోడ్లనే కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాదారుడిపై పీఐటీ-ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగం

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు నిందితుడి తరలింపు..
- జిల్లాలో ఇప్పటివరకు 13 మందిపై నిర్బంధ ఉత్తర్వులు

గుంటూరు, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న అలవాటుపడిన నేరస్థులపై గుంటూరు జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ పజిల్ (22)పై పీఐటీ--ఎన్‌డీపీఎస్ చట్టం, 1988లోని సెక్షన్ 3(1) కింద రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసింది. జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నిందితుడిని పోలీసు భద్రత మధ్య రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించి జైలు అధికారులకు అప్పగించారు.

పొన్నూరు టౌన్, పొన్నూరు రూరల్, చేబ్రోలు పోలీస్ స్టేషన్ల పరిధుల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న షేక్ పజిల్‌పై పలు కేసులు నమోదయ్యాయి. పొన్నూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2025లో నమోదైన కేసులో 2.6 కిలోల గంజాయి, చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 2024లో నమోదైన రెండు కేసుల్లో వరుసగా 22.4 కిలోలు, 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం జీఓ. ఆర్‌టీ నంబర్ 2035 ద్వారా నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇప్పటివరకు 13 మందిపై పీఐటీ-ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు అమలు చేశారు. గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించి సుమారు 508 మందిని అరెస్టు చేసి, వారి నుంచి 150 కిలోల గంజాయి, 7 కిలోల లిక్విడ్ గంజాయి, 57.33 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచేందుకు 28 మందిపై రౌడీషీట్లు, 582 మందిపై సస్పెక్ట్ షీట్లు నమోదు చేశారు. మొత్తం 610 మందిపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.

మరోవైపు యువత, విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు సుమారు 400 సంకల్పం కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 80 వేల మందికి అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగదారులను గుర్తించేందుకు నిర్వహించిన ర్యాపిడ్ డ్రగ్ పరీక్షల్లో 52 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వారిపై తగిన చర్యలు తీసుకున్నారు.

యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యాపారానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

12వ పిఆర్సీకి డిసెంబరు 31లోగా వినతులు అందించాలి

- సమస్యలు,అభ్యంతరాలు,సూచనలు అందించాలి
- ఉద్యోగులు,ఉద్యోగ సంఘాలకు కమీషన్ కార్యదర్శి డా.పి.లక్ష్మీనర్సింహం విజ్ఞప్తి

అమరావతి, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): 12వ వేతన సవరణ సంఘం(పే రివిజన్ సంఘం)కు డిశంబరు 31లోగా ఉద్యోగులు,ఉద్యోగ సంఘాల,వివిధ అసోసియేషన్లు వారి వినతులు,సూచనలు, అభ్యంతరాలను అందించాలని పే రివిజన్ కమీషన్ కార్యదర్శి డా.పి.లక్ష్మీనర్సింహం విజ్ఞప్తి చేశారు.వినతులు,సూచనలను కార్యదర్శి,12వ వేతన సవరణ సంఘం,గది నం.188,గ్రౌండ్ ఫ్లోర్,4వ భవనం,ఆంధ్రప్రదేశ్ సచివాలయం, వెలగపూడి, అమరావతి-522238.

ఈ-మెయిల్: secytoprc-12@ap finance. gov.inకు డిశంబరు 31లోగా సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధారణ పరిపాలన(ఎస్సి.ఎ) శాఖ జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నం.200, తేదీ 01-10-2026 ద్వారా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ కమీషనర్ గా 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించింది.కమీషన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఏడాది లోగా కమీషన్ నివేదిక సమర్పించాల్సించిదిగా ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.దీనికి సంబంధించి గతంలో జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నం.68, తేదీ 12-07-2023లో పేర్కొన్న విధివిధానాలు వర్తిస్తాయని ఆఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.వేతన సవరణ సంఘం కార్యదర్శిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.పి.లక్ష్మీ నర్సింహంను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో 12వేతన సవరణ సంఘం కార్యకలాపాలు వేగవతం కానున్నాయి.

వేతన సవరణ సంఘం పరిశీలించనున్న అంశాలు

1.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,స్థానిక సంస్థలు,ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగుల వేతనాలు,ఇతర ప్రయోజనాలు,సర్వీసు నిబంధనలకు సంబంధించిన సూత్రాలను రూపొందించడం.

అలాగే కింది ఉద్యోగుల విషయాలను కూడా పరిశీలించనుంది.

విశ్వవిద్యాలయాల్లో బోధనేతర సిబ్బంది,ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు,జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఉద్యోగులు,వర్క్‌చార్జ్డ్ ఉద్యోగులు,

పూర్తి కాల కాంటింజెంట్ ఉద్యోగులు.వీరికి ప్రస్తుతం అందుతున్న అన్ని ఆర్థిక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మరియు సాధ్యమైన మార్పులపై సిఫార్సులు చేయనుంది.

అయితే ఈ కింది ఉద్యోగులు ఈ సంఘం పరిధిలోకి రారు: ప్రభుత్వ కళాశాలలు,యూజీసీ/ఏఐసీటీఈ మరియు ఐసీఏఆర్ పే స్కేళ్లు పొందుతున్నప్రభుత్వ ఎయిడెడ్ ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది.అలాగే రెండవ జాతీయ న్యాయ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం వేతనాలు పొందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు మరియు రాష్ట్ర న్యాయ సేవల్లోని అధికారుల అంశాలను కూడా ఈ సంఘం పరిశీలించదు.

2.కరువు భత్యం : ప్రస్తుతం అమలులో ఉన్న కరువు భత్యాన్ని వేతనంలో ఎంతవరకు విలీనం చేయవచ్చో పరిశీలించాలి.అలాగే కరువు భత్యాన్ని విలీనం చేసిన తరువాత కొత్త వేతన స్కేళ్లను రూపొందించి సవరించిన వేతన స్కేళ్లలో వేతన నిర్ధారణ విధానాన్ని సూచించాలి.

3.ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్: కాలానుగుణంగా మార్పులు చేసిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ పథకాన్నిపరిశీలించాలి.ఈ పథకం అమలులో ఎదురైన సమస్యలు లోపాలను అధ్యయనం చేయాలి.ప్రస్తుత రూపంలోనే ఈ పథకాన్ని కొనసాగించాలా లేదా అనే అంశంపై పరిశీలించి సిఫార్సులు చేయాలి.

4.ప్రత్యేక వేతనాలు,అలవెన్సులు: ప్రస్తుతం అందిస్తున్న వివిధ రకాల ప్రత్యేక వేతనాలు , పరిహార భత్యాలు,ఇతర అలవెన్సులు,నగదు లేదా వస్తు రూపంలో అందించే ప్రయోజనాల అవసరాన్ని పరిశీలించాలి.వాటిని కొనసాగించాలా లేదా అనే అంశంపై సిఫార్సులు చేయాలి. కొనసాగించాలని నిర్ణయిస్తే వాటి రేట్లు,నిబంధనలు, భవిష్యత్తులో అమలు చేయాల్సిన ఇతర షరతుల్లో అవసరమైన మార్పులను సూచించాలి.

5.పెన్షన్ విధానం: పెన్షనర్లకు ప్రస్తుతం అమలులో ఉన్న పెన్షన్ విధానాన్ని పరిశీలించి సమీక్షించాలి.అవసరమైన మరియు సాధ్యమైన మార్పులపై సిఫార్సులు చేయాలి.

6.పోస్టుల గెజిటెడ్ హోదా: వివిధ కేటగిరీల పోస్టులకు గెజిటెడ్ హోదా కల్పించేందుకు అవసరమైన సూత్రాలు,ప్రమాణాలు, అర్హతలు,మార్గదర్శకాలను రూపొందించాలి.అలాగే ఉద్యోగ సంఘాలు,పరిపాలనా విభాగాలు గెజిటెడ్ హోదా కల్పించాలని ప్రతిపాదించిన పోస్టుల కేటగిరీలపై సూచనలు చేయాలి.

7.మానవ వనరుల సమీక్ష:ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న మానవ వనరులను సమీక్షించాలి.ముఖ్యంగా రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సహా అన్నిరకాల సిబ్బంది అవసరాలను పరిశీలించాలి.

8.ఇతర అంశాలు: వేతన సవరణ సంఘం పదవీకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనకు అప్పగించే ఇతర అంశాలపై కూడా సిఫార్సులు చేయాలి.

9.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి: వేతన సవరణ సంఘం తన సిఫార్సులను రూపొందించే సమయంలో రాష్ట్రం యొక్క మొత్తం ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవచ్చు.

అభిప్రాయాలు,వినతుల స్వీకరణ

వేతన సవరణ సంఘం తనకు వచ్చే వినతులను స్వీకరించడం,సాక్ష్యులను విచారించడం, అవసరమైన సమాచారాన్ని కోరడం వంటి అంశాలపై స్వంత విధానాన్నిరూపొందించు కోవచ్చు.సచివాలయ విభాగాలు,శాఖాధిపతులు వేతన సవరణ సంఘం కోరినప్పుడు అవసరమైన సమాచారాన్ని అందించాలి. సంఘానికి అవసరమైన సహకారం,సహాయాన్ని అందించాలి.

వేతన సవరణ సంఘం పరిశీలనకు నిర్దేశించిన పై అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయదలచిన వారందరి నుంచి వినతులు ఆహ్వానిస్తున్నట్టు కమీషన్ కార్యదర్శి డా.లక్ష్మీనర్సింహ తెలియజేశారు.

ఈకింది సంస్థలు,సంఘాలు, వ్యక్తులు తమ వినతులు, మెమోరాండాలు సమర్పించవచ్చు:

ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు,ఉద్యోగుల అసోసియేషన్లు, పెన్షనర్ల సంఘాలు,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,జిల్లా గ్రంథాలయ సంస్థలతో సహా స్థానిక సంస్థలు,ఎయిడెడ్ సంస్థలు,జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహా విశ్వవిద్యాలయాలు.

వినతులు పంపాల్సిన చిరునామా: కార్యదర్శి,12వ వేతన సవరణ సంఘం,గది నం.188, గ్రౌండ్ ఫ్లోర్,4వ భవనం, ఆంధ్రప్రదేశ్ సచివాలయం,వెలగపూడి,అమరావతి-522238.ఈ-మెయిల్:secytoprc-12@ap finance. gov.in

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు

- 400 మంది ఉద్యోగుల రక్తదానం..
- 600 మందికి కంటి పరీక్షలు..
- 250 మందికి దంత వైద్య సేవలు



అమరావతి, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): సామాజిక బాధ్యతలో భాగంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో యూనివర్సిటీ ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయడంతో పాటు కంటి, దంత వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

గురువారం ఉదయం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. విజయవాడ ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి విచ్చేసిన డాక్టర్ రష్మిత, డాక్టర్ మాధవి తమ వైద్య బృందంతో కలిసి శిబిరంలో పాల్గొని వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన రక్తదాన శిబిరంలో యూనివర్సిటీకి చెందిన 400 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం ప్రాముఖ్యతను, ఆపద సమయంలో రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చనే విషయాన్ని వైద్యులు వివరించారు.

అదే విధంగా విజయవాడకు చెందిన సంధ్యా కంటి ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో 600 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ భార్గవ్ నేతృత్వంలోని వైద్యులు కంటి సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.

శుక్రవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి దంత పరీక్షలు చేశారు. గుంటూరు సమీపంలోని సిబార్ దంత వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ సృజన, డాక్టర్ పావని తమ వైద్య బృందంతో కలిసి పాల్గొని పరీక్షలు నిర్వహించారు. దంత సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు. దంతాల పరిశుభ్రత, నోటి ఆరోగ్యం విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, రేవతీ బాలకృష్ణన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ రాజు ఇమందీ, డాక్టర్ రంగాచారి, డాక్టర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సేవలందించడంలో అన్నదాన సత్రం కృషి అభినందనీయం



- ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- భీమేశ్వర స్వామి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

గుంటూరు, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం ద్వారా నిత్యం ఎంతోమంది భక్తులకు, పేదలకు సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని అన్నారు.

నగరంలోని 60వ డివిజన్ అమరావతి రోడ్డులో ఉన్న అన్నదాన సత్రం వద్ద శ్రీ ఉమా మహేశ్వర స్వామి (భీమేశ్వర స్వామి) దేవస్థాన పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును భరించేందుకు ముందుకొచ్చిన కోటేశ్వరరావును ఈ సందర్భంగా వారు అభినందించారు. దేవస్థాన నిర్మాణం త్వరితగతిన పూర్తయి స్వామివారి ఆశీస్సులు స్థానిక ప్రజలకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు.

దేవస్థానం ఈఓ, ఆలయ చైర్మన్ సాంబశివరావు పర్యవేక్షణలో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు స్థానిక కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారని, ఏవైనా అవసరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సంబంధిత అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి, ఇతర కార్పొరేటర్లు, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

జీఎంసీ ఎల్ఆర్ఎస్ మేళాకు విశేష స్పందన



- శనివారం కూడా కొనసాగింపు..
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి మరో అవకాశం

గుంటూరు, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) ప్రత్యేక మేళాకు విశేష స్పందన లభించింది.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రత్యేక మేళా నిర్వహించారు. ఈ మేళాకు 155 మంది దరఖాస్తుదారులు హాజరై తమ దరఖాస్తుల పరిష్కారానికి ముందుకు వచ్చారు.

ఈ విషయాన్ని నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ డి. రాంబాబు వెల్లడించారు. జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌తో పాటు బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాకు ఇంజినీర్లు కూడా పెద్ద సంఖ్యలో హాజరైనట్లు పేర్కొన్నారు.

శనివారం కూడా ప్రత్యేక మేళా కొనసాగుతుందని, సంబంధిత ఫీజులు చెల్లించాల్సిన వారు, దరఖాస్తుల పరిశీలనలో భాగంగా షార్ట్‌ఫాల్ ఎండార్స్‌మెంట్లు జారీ అయిన వారు అవసరమైన పత్రాలను సమర్పించి తమ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

దరఖాస్తుదారులు సంబంధిత పత్రాలు, ఫీజు చెల్లింపు రసీదులతో మేళాకు హాజరై ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సిటీ ప్లానర్ సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేసుకోవాలని కోరారు.

గోదావరి తీరంలో రేలంగి శ్రీదేవి విస్తృత ప్రచారం



రాజమహేంద్రవరం, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): రాజమండ్రి మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి శుక్రవారం ఉదయం గోదావరి నదీ తీరంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి స్నాన ఘాట్ల వద్దకు వచ్చిన భక్తులు, స్థానిక ప్రజలను కలిసి మాట్లాడారు. పలువురు పెద్దల ఆశీస్సులు తీసుకుంటూ, ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

హెచ్ఐవీ నియంత్రణలో ఏపీకి ప్రత్యేక గుర్తింపు

- 28 జిల్లాల్లో 16 జిల్లాలకు ఉన్నత హోదా
- ఆరు జిల్లాలకు 'సురక్షిత్'.. మరో 10 జిల్లాలకు 'సక్షమ్' గుర్తింపు
- ఏప్రిల్ నుంచి అక్టోబరు మధ్య మెరుగైన పనితీరు
- నాకో వెల్లడి
- మరో మూడు జిల్లాలను 'సురక్షిత్' స్థాయికి తీసుకొచ్చేందుకు కృషి

మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అమరావతి, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): హెచ్ఐవీ నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ సాధించిన పురోగతికి కేంద్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) గురువారం రాష్ట్రంలోని ఆరు జిల్లాలు 'సురక్షిత్', మరో 10 జిల్లాలు 'సక్షమ్' హోదా పొందినట్లు ప్రకటించింది. 2026 అక్టోబరు నాటి పనితీరు ఆధారంగా రాష్ట్రంలోని 28 జిల్లాలకు ఇచ్చిన వర్గీకరణలో 16 జిల్లాలు ఉన్నత హోదాలు పొందాయి. మూడు నిర్దేశిత లక్ష్యాలనూ చేరుకున్న చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు 'సురక్షిత్' హోదా దక్కింది. మూడు లక్ష్యాల్లో రెండింటిని సాధించిన అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, కర్నూలు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాలకు 'సక్షమ్' గుర్తింపు లభించింది. మిగిలిన 12 జిల్లాలను 'సంఘర్షశీల' విభాగంలో చేర్చారు. ఏప్రిల్ నుంచి అక్టోబరు మధ్య 16 జిల్లాలు తమ పనితీరును మెరుగుపరచుకున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

మూడు లక్ష్యాల సాధనే ప్రామాణికం: హెచ్ఐవీ నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన మూడు 95 లక్ష్యాల ఆధారంగా జిల్లాల పనితీరును అంచనా వేశారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో కనీసం 95 శాతం మందికి తమ వ్యాధి స్థితిపై అవగాహన కల్పించడం మొదటి లక్ష్యం. వ్యాధి నిర్ధారణ అయిన వారిలో కనీసం 95 శాతం మందికి వైరస్ నియంత్రణ మందుల చికిత్స (ఏఆర్టీ) అందించడం రెండో లక్ష్యం. చికిత్స పొందుతున్న వారిలో కనీసం 95 శాతం మందిలో వైరస్ స్థాయిని నియంత్రణలో ఉంచడం మూడో లక్ష్యం.

ఆరు జిల్లాలకు 'సురక్షిత్' హోదా: మూడు నిర్దేశిత లక్ష్యాలనూ సాధించిన చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు ఉన్నత స్థాయి గుర్తింపు పొందాయి. మరో రెండు లక్ష్యాలను సాధించిన అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, కర్నూలు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాలు 'సక్షమ్' హోదా పొందాయి. మిగిలిన 12 జిల్లాలకు ప్రత్యేక పర్యవేక్షణ, మార్గదర్శకత్వం అందిస్తూ లక్ష్యాల సాధనకు చర్యలు చేపడుతున్నారు.

92.7 శాతానికి పెరిగిన వ్యాధి నిర్ధారణ: హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో తమ వ్యాధి స్థితిని తెలుసుకున్న వారి శాతం ఏప్రిల్ 2026లో 87.7గా ఉండగా, అక్టోబరు నాటికి 92.7కు పెరిగింది. ప్రస్తుతం ఇది 92.8 శాతంగా ఉంది. సమగ్రసలహా, పరీక్షా కేంద్రాల ద్వారా ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 7,641 మందికి హెచ్ఐవీ ఉన్నట్లు గుర్తించారు. వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, పరిశ్రమలు, రేవు ప్రాంతాలు, వైద్య సేవలు తక్కువగా అందుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తనిధులు, చికిత్స కేంద్రాలు, జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంతో సమన్వయం పెంచి ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్సకు చర్యలు తీసుకుంటున్నారు.

2.65 లక్షల మందికి చికిత్స: హెచ్ఐవీ బాధితులకు వైరస్ నియంత్రణ మందుల చికిత్స అందించడంలో రాష్ట్రం పురోగతి సాధించింది. చికిత్స పొందుతున్న వారి శాతం ఏప్రిల్ 2026లో 86.3గా ఉండగా, అక్టోబరు నాటికి 92.7కు పెరిగింది. ఈ కాలంలో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 2,41,507 నుంచి 2,65,690కు చేరింది. అదనంగా 24,183 మందికి చికిత్స అందుతోంది. చికిత్స పొందుతున్న వారిలో 96.4 శాతం మందికి వైరస్ స్థాయి నియంత్రణలో ఉంది.

'సురక్ష' డ్యాష్‌బోర్డుతో పర్యవేక్షణ: హెచ్ఐవీ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీఎస్ఏసీఎస్) 'సురక్ష' డ్యాష్‌బోర్డును రూపొందించింది. రోజువారీ పరీక్షలు, కొత్తగా గుర్తించిన బాధితులు, వారిని చికిత్స కేంద్రాలకు అనుసంధానించిన వివరాలను జిల్లా, వైద్య కేంద్రాల వారీగా పరిశీలిస్తున్నారు. మందుల వాడకాన్ని మధ్యలో ఆపేసిన వారిని తిరిగి చికిత్సలోకి తీసుకొచ్చేందుకు 2026 జులైలో 'ఈచ్ వన్ రీచ్ వన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్షేత్రస్థాయి సిబ్బంది బాధితులను గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జులై 16 నుంచి నివేదిక సమర్పించిన తేదీ వరకు 3,748 మందిని తిరిగి వైద్య సేవల్లోకి తీసుకొచ్చారు.

2030 నాటికి ఎయిడ్స్ నియంత్రణే లక్ష్యం: జిల్లా సమగ్ర హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యూహం ద్వారా రాష్ట్రంలోని 28 జిల్లాల్లో పర్యవేక్షణను బలోపేతం చేస్తున్నారు. మూడు లక్ష్యాల పురోగతిని నిరంతరం సమీక్షిస్తున్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ వివక్ష లేకుండా సకాలంలో వ్యాధి నిర్ధారణ, నిరంతర చికిత్స, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, సాంకేతిక పరిజ్ఞానం, జిల్లాల సమన్వయంతో 2030 నాటికి ఎయిడ్స్‌ను ప్రజారోగ్య ముప్పుగా లేకుండా చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ వారంలో మరో మూడు జిల్లాలను 'సురక్షిత్' స్థాయికి తీసుకురావడానికి యుద్ధప్రాతిపదికన దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని ప్రాజెక్ట్ డైరెక్టర్ సురణ్ రాజ్ తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచినందుకు అధికారులను వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ అభినందించారు.

కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్డీయే అభ్యర్థి బి. రమాదేవి ఎంపిక



- రమాదేవిని స్వయంగా కలిసి అభినందించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు

కృష్ణా జిల్లా, నవంబర్ 20 (జర్నలిస్ట్ ఫైల్): కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్డీయే అభ్యర్థి శ్రీమతి బి. రమాదేవి ఎంపిక కావడంతో బీజేపీ నాయకులు ఆమెను స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి కిలారి దిలీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, కృష్ణా జిల్లా బీజేపీ అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్‌లు రమాదేవిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ప్రజా సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఆరు నెలల్లో 12వ పీఆర్సీ నివేదిక ఇవ్వాలి

- 13వ పీఆర్సీ కోల్పోకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



గుంటూరు, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేపథ్యంలో 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను ఆరు నెలల్లోగా సమర్పించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ కోరారు. ఈ మేరకు పీఆర్సీ కమిషనర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే నివేదిక సమర్పణలో 40 నెలల ఆలస్యం జరిగిందని, ఇకనైనా త్వరితగతిన నివేదిక అందించి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాస్తవానికి 2023 జూలై 1 నుంచి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉందని, ఆలస్యం కారణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని షరీఫ్ పేర్కొన్నారు. పీఆర్సీ ద్వారా లభించే అన్ని ఆర్థిక ప్రయోజనాలను వాస్తవ అమలు తేదీ అయిన 2023 జూలై 1 నుంచే వర్తింపజేసేలా సిఫార్సులు చేయాలని కమిషనర్‌ను కోరినట్లు వెల్లడించారు. 2028 జూలై 1 నుంచి 13వ పీఆర్సీ అమలు కావాల్సి ఉందని, 12వ పీఆర్సీ నివేదిక సమర్పణ, అమలులో మరింత జాప్యం జరిగితే ఉద్యోగులు తదుపరి పీఆర్సీ ప్రయోజనాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

గత పీఆర్సీ అమలులో జరిగిన జాప్యం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కలిగిన నష్టాన్ని పూడ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని షరీఫ్ కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆరు నెలల్లో నివేదిక సమర్పించి, ఉద్యోగ వర్గాలకు న్యాయం చేయాలని పీఆర్సీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

స్థానిక పదవుల్లో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట



- బీసీలకు 35 శాతం సీట్ల హామీ నిలబెట్టుకున్నాం
- 95 శాతం స్ట్రైక్‌రేట్‌తో కూటమి విజయం
- పర్చూరి అశోక్‌బాబు

మంగళగిరి, నవంబరు 20 (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పించామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు తెలిపారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 35 శాతం సీట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, జనరల్ స్థానాల్లోనూ బీసీ, ఎస్టీలకు అవకాశాలు కల్పించామని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి దాదాపు 95 శాతం స్ట్రైక్‌రేట్‌తో విజయం సాధించిందన్నారు.

17 మున్సిపల్ కార్పొరేషన్లలో 10, 106 మున్సిపాలిటీల్లో 58 స్థానాలను మహిళలకు కేటాయించామని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవుల్లో 56 శాతం మహిళలకు, ఎనిమిది స్థానాలు బీసీలకు ఇచ్చామన్నారు. ఎంపీపీ పదవుల్లోనూ మహిళలు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం కల్పించామని వివరించారు.

గత వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని, నాటి అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని విమర్శించారు. ఈసారి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడంతో పులివెందుల, పుంగనూరులోనూ వైసీపీని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు.

మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించడమే నిజమైన సామాజిక న్యాయమని అన్నారు.

కూటమి ధర్మానికి టీడీపీ కట్టుబడి ఉందని, బలాబలాలతో సంబంధం లేకుండా మిత్రపక్షాలకు పదవులు కేటాయించామని అశోక్‌బాబు తెలిపారు. బీజేపీకి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల సంఖ్య తక్కువగా ఉన్నచోట కూడా ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ పదవులు ఇచ్చామని చెప్పారు. పార్టీ నిర్ణయాలను ధిక్కరించి రెబల్స్‌గా పోటీ చేసిన వారిపై చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

సంక్షేమ పథకాలతో పాటు అన్ని వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడమే కూటమి విజయానికి కారణమని అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. 2029లోనూ కూటమి తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కూటమి ఐక్యతతో వేమూరు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి



బాపట్ల, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): బాపట్ల జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన పుప్పదేవి రోహిణి, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కలవకూరి పిచ్చమ్మలను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

అదేవిధంగా వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన పల్లపాటి బలాజీ (అమృతలూరు), నక్కా శ్రీనివాసరావు (భట్టిప్రోలు), సుగ్గున సరవంతి (కొల్లూరు), వలివేటి నాగమల్లేశ్వరి (చుండూరు), వెల్పుల రావి ప్రసాద్ (వేమూరు)లకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో జిల్లా పరిషత్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ స్ఫూర్తితో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాప్రతినిధులు ఐకమత్యంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కూటమి ఐక్యత, సమన్వయం, పరస్పర సహకారమే అభివృద్ధికి పునాదులని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలని, గ్రామీణ రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, సాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల సమగ్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ సహకారంతో అవసరమైన నిధులు సాధించి, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేస్తామని నక్కా ఆనంద బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మెగా బుక్ ఎగ్జిబిషన్

- 15 ప్రముఖ ప్రచురణ సంస్థల నుంచి 4 వేలకు పైగా పుస్తకాల ప్రదర్శన
- ఇంజినీరింగ్, సైన్స్, సాహిత్య పుస్తకాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన
- తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో భగవద్గీత గ్రంథాలు ప్రత్యేక ఆకర్షణ



అమరావతి, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు, వివిధ రంగాల్లో అందుబాటులో ఉన్న విజ్ఞానాన్ని పరిచయం చేయాలనే లక్ష్యంతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మెగా బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో జరిగిన ఈ ప్రదర్శనకు విద్యార్థులు, అధ్యాపకులు, యూనివర్సిటీ సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది.

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ ఈ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ కార్యదర్శి రావి శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ ఎగ్జిబిషన్‌లో ఆక్స్‌ఫర్డ్, పెంగ్విన్, కేంబ్రిడ్జ్, స్ప్రింగర్, పీఎస్ఎన్ తదితర 15 ప్రముఖ ప్రచురణ సంస్థలు పాల్గొన్నాయి. ఇంజినీరింగ్, సైన్స్, సాహిత్యం సహా వివిధ విభాగాలకు చెందిన 4 వేలకు పైగా పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. విద్యార్థులకు తమ విద్యా విభాగాలకు సంబంధించిన తాజా పుస్తకాలను పరిశీలించడంతో పాటు, ఆసక్తి ఉన్న ఇతర అంశాలపై విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ ప్రదర్శన చక్కని వేదికగా నిలిచింది.

ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ సందర్శకులను ఆకర్షించింది. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రచురించిన భగవద్గీత గ్రంథాలను అక్కడ అందుబాటులో ఉంచారు. పుస్తక ప్రదర్శన నిర్వహణలో భాగంగా చెన్నైకి చెందిన శాంతి బుక్ హౌస్, శాన్ఫ్రాన్ సంస్థలు ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో ముందుగానే అవగాహన కుదుర్చుకుని సహకారం అందించాయి.

రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనను యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించి తమకు అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ విష్ణుపథ్, సీవీటామి, సుమ, చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ జానకిరామన్ అమృతల్లి, డాక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట : మంత్రి దుర్గేష్

- నూతన జెడ్పీ చైర్‌పర్సన్‌గా కాడ పద్మ, వైస్ చైర్‌పర్సన్‌గా పల్నాటి రజిని ఎన్నిక..
- జెడ్పీటీసీలుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు అభినందనలు తెలిపి సత్కరించిన మంత్రి కందుల దుర్గేష్
- తూర్పు గోదావరి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతాం: మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరం,నవంబర్ 20 (జర్నలిస్ట్ ఫైల్): రాజమహేంద్రవరంలోని తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం, నూతన జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జెడ్పీటీసీ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన జెడ్పీ చైర్‌పర్సన్ కాడ పద్మ, వైస్ చైర్‌పర్సన్ పల్నాటి రజినిలను మంత్రి కందుల దుర్గేష్ శాలువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఎన్నికల ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవుల రెండింటికీ మహిళలనే ఎన్నుకోవడం ఎంతో విశేషమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనడానికి ఇదే నిదర్శనమన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ పక్షాల సమష్టి మద్దతుతో ఈ అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా భౌగోళిక స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని, గోదావరి నదికి ఇటువైపు ప్రాంతం నుండి చైర్‌పర్సన్‌ను, అటువైపు ప్రాంతం నుండి వైస్ చైర్‌పర్సన్‌ను ఎంపిక చేయడం పట్ల మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతూకంతో ముందుకు తీసుకెళ్లేందుకు వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని శాసనసభ్యులు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ సభ్యులందరి సమన్వయంతో తూర్పు గోదావరి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

సింహాద్రిపురంలో పథకం ప్రకారమే వైసీపీ అల్లర్లు



- ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- అవినాష్‌రెడ్డిని ఎన్నికలు ముగిసే వరకు రాష్ట్రం నుంచి బహిష్కరించాలి: వర్ల రామయ్య

అమరావతి, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ నేతలు ఓటమి భయంతో దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ ఆరోపించింది. ఈ మేరకు ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఏ. మల్లిఖార్జున, ఐజీ రాజకుమారిని కలిసి ఫిర్యాదు చేసింది. దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలను పెన్‌డ్రైవ్‌ల రూపంలో అందజేసింది.

పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురంలో హౌస్ అరెస్ట్ నోటీసులను ధిక్కరించి ఎంపీ అవినాష్‌రెడ్డి 35 కార్ల కాన్వాయ్‌తో పర్యటించారని వర్ల రామయ్య ఆరోపించారు. సింహాద్రిపురం, అంకాలమ్మగూడూరు వద్ద ఉద్రిక్తతలు సృష్టించి టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడ్డారని, తాడిపత్రిలోనూ రాళ్లదాడి జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అన్నమయ్య జిల్లా తూములకుంటలో టీడీపీ నేత రఘుపతి నాయుడిపై దాడి చేసి చెవి కొరికిన ఘటనపై జగన్ సమాధానం చెప్పాలని వర్ల డిమాండ్ చేశారు. పల్నాడు దాడిలో తీవ్రంగా గాయపడిన కార్యకర్త కేసును హత్యాయత్నం కింద మార్చాలని, గుంటూరు జైలు ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అవినాష్‌రెడ్డిని నిర్బంధించాలని, అవసరమైతే డిసెంబరు 3 వరకు రాష్ట్రం నుంచి బహిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు.

సాక్షి ఛానల్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

సమస్యాత్మక జిల్లాల్లో పోలీసు నిఘా పెంచి, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదుపై న్యాయ నిపుణులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం అధికారులు స్పందించినట్లు వర్ల రామయ్య వెల్లడించారు.

ట్రాన్స్‌కో జేఎండీకి ఉద్యోగుల సమస్యలపై వినతి



విజయవాడ, నవంబర్ 20(జర్నలిస్ట్ ఫైల్): ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్‌ను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు శుక్రవారం విద్యుత్ సౌధలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొత్త పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీ తదితర అంశాలపై చర్చించారు.

విజయవాడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుపేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ఆసుపత్రి అభివృద్ధికి ప్రవీణ్ చంద్ ప్రత్యేక చొరవ చూపారని సురేష్ బాబు కొనియాడారు.

ప్రస్తుతం ట్రాన్స్‌కో, సీఆర్డీఏలోనూ ఆయన పనితీరు ప్రశంసనీయమన్నారు. విద్యుత్ శాఖలో కొత్త పోస్టులు మంజూరు చేసి, అవసరమైన నియామకాలు చేపట్టాలని కోరగా.. వినతుల పరిష్కారానికి కృషి చేస్తానని జేఎండీ హామీ ఇచ్చినట్లు సురేష్ బాబు తెలిపారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com